ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
మంగళవారం 18 జూన్ 2024


పట్టిసీమ నుంచి విడుదలవుతున్న నీరు (పాత చిత్రం)

కృష్ణా డెల్టాలో ఖరీఫ్ సాగుకోసం రైతులు దుక్కులు మొదలు పెట్టేశారు. నారుమళ్లుకూడా పోసే తరుణం వచ్చేసింది. కానీ కృష్ణా జలాశయాల్లో నీరు మాత్రం అడుగంటింది. గత ఖరీఫ్ సీజన్‌లోనూ నీటి లభ్యత ఇంతకంటే కాస్తంత మెరుగ్గా ఉన్నా సకాలంలో నీరందలేదు. దీంతో సాగు కూడా ఆలస్యం అయింది. అప్పుడు పట్టిసీమ అందుబాటులో ఉన్నా గత ప్రభుత్వం పంతం పట్టి దీనిని సద్వినియోగం చేసుకునేందుకు ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. అయితే చంద్రబాబు సర్కారు తాజాగా కొలువుతీరటం, ఖరీఫ్‌కు ముందే ప్రభుత్వం అధికారంలోకి రావటంతో కృష్ణా డెల్టా రైతుల్లో ఆశలు చిగురించాయి. జలాశయాల్లో నీరు లేకున్నా, గోదావరి జలాలను మళ్లించుకుని పంట పండించుకోవచ్చనే ధైర్యంతో రైతులున్నారు.

- కృష్ణా డెల్టాకు పట్టిసీమే దిక్కు
- చంద్రబాబు రాకతో మళ్లీ పునరుజ్జీవం!
- అవసరం ఉన్నా గత ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం
- ఎగువ జలాశయాలు ఖాళీ... ఈ ఖరీఫ్‌కు నీరందే పరిస్థితి లేదు
- యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేస్తే జలకళే
- కాల్వల అత్యవసర మరమ్మతులూ వేగవంతం చెయ్యాలి

చిగురాశలు


కృష్ణా పశ్చిమ డెల్టాలో ఖరీఫ్ సాగుకోసం దుక్కులు దున్ని సిద్ధం చేసిన భూములు

తెనాలి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గతంలో కృష్ణా జలాలు అడుగంటిన సమయంలో, గోదావరి నది నుంచి వృధాగా పోతున్న లక్షల క్యూసెక్కుల నీటిపై చంద్రబాబు దృష్టి పెట్టారు. ఆ నీటిని కృష్ణా డెల్టాకు మళ్లిస్తే నీటి కరవు తీరుతుందన్న ఆలోచనతో అప్పట్లో చంద్రబాబు పట్టిసీమను తీసుకొచ్చారు. గోదావరి నది నుంచి కాల్వల ద్వారా ప్రకాశం బ్యారేజికి నీటిని తీసుకొచ్చి వాటిని డెల్టా భూములకు సాగు, తాగునీటి కోసం ఉపయోగించారు. అయితే జగన్ సర్కారు వచ్చాక చంద్రబాబు తీసుకొచ్చిన పట్టిసీమ కావటంతో దానిని ఉపయోగించటానికి ససేమిరా అంటూ కాల్వలను పట్టించుకోవటం మానేశారు. అత్యవసర పరిస్థితుల్లో కేవలం రెండు, మూడు పర్యాయాలు మాత్రమే అతి తక్కువ నీటిని తీసుకున్నాం అనిపించారు. ఈ ఐదేళ్లు అసలు పట్టిసీమను పట్టించుకోకపోవటంతో కాల్వలన్నీ అధ్వాన స్థితికి వచ్చాయి. అయితే ఇప్పుడు చంద్రబాబు ముఖ్యమంత్రిగా పీఠమెక్కటంతో డెల్టా రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.


తెనాలి- చందోలు మధ్య పచ్చిరొట్ట విత్తనాలు చల్లుతున్న రైతులు

జగన్ సర్కారు నిర్లక్ష్యంతో గత ఖరీఫ్ ఆలస్యం

కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలో గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల పరిధిలో 5.71 లక్షల ఎకరాల్లో ఏటా వరి సాగవుతుంది. ఖరీఫ్‌లో వరి సాగు చేస్తే, రబీలో మొక్కజొన్న, మినుము, జొన్న పంటలు సాగుచేయటం ఆనవాయితీ. అయితే ఈ ఐదేళ్లలో ఒక సంవత్సరం మినహా మిగిలిన ఖరీఫ్ సీజన్‌లలో సకాలంలో సాగునీరు అందిన పరిస్థితి లేదు. గత ఖరీఫ్ సీజన్‌లో సాగునీటి ఆలస్యం కారణంగా సాగులో జాప్యం ఏర్పడింది. కాల్వల చివరి భూముల్లో అయితే మరింత ఆలస్యం కావటం, కొన్నిచోట్లయితే నాటు వేయటానికి సాహసించలేని పరిస్థితులూ వచ్చాయి. సాధారణంగా ప్రతి సంవత్సరం జూన్ మొదటి వారంలో నారుమళ్లు పోయటం, జూలైలో నాట్లు వేయటం కృష్ణా పశ్చిమ డెల్టాలో ఆనవాయితీ. పట్టిసీమ లేకముందు సాగునీటికి కటకట ఏర్పడిన తరుణంలో మాత్రమే సాగు జూలై దాటిపోయేది. అయితే పట్టిసీమ వచ్చాక కృష్ణా జలాశయాల్లో నీరు లేకపోయినా, చంద్రబాబు ప్రభుత్వ కాలంలో గోదావరి నది నుంచి నీటిని పట్టిసీమ ద్వారా మళ్లించి మరీ సాగు సకాలంలో జరిగేలా చూడగలిగారు.

జలాశయాలు.. ఆవిరి

అటు పులిచింతలలోనూ ఉన్న కొద్దిపాటి నీటిని తాగునీటికోసం, ఇతర అవసరాలకోసం వదిలేయటంతో మొత్తం అడుగంటింది. 2023 జులై నాటికి శ్రీశైలం జలాశయంలో కేవలం 33 టీఎంసీల నీరే నిల్వ ఉంది. ఆ తర్వాత పెద్దగా నీరు ఎగువ నుంచి వచ్చిచేరిన పరిస్థితి లేదు. 2022 జూలై సమయంలో ఎగువ నుంచి వరద రావటంతో 101 టీఎంసీలు నీరు శ్రీశైలం చేరితే, గతేడాది అదికాస్తా ఆవిరైపోయింది. ఇటు నాగార్జున సాగర్, పులిచింతలలోనూ నీరు నిండుకుంది. పులిచింతలలో పూర్తి నీటినిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు ఉంటే, 2023 సంవత్సరంలో కేవలం 16 టీఎంసీల నీరే మిగిలింది. దీనిలోనూ తెలంగాణలోని క్యాచ్‌మెంట్ ఏరియాలో కురిసిన వర్షాలకు అదనంగా 5 టీఎంసీలు వచ్చి చేరింది. దీంతో తాగునీటి కష్టాలు తీరాయి. ఇప్పుడు పూర్తిగా అడుగుకు నీరు చేరటంతో దిక్కుతోచని పరిస్థితి. పులిచింతల నుంచి చుక్కనీటిని కూడా తీసుకోలేని దయనీయ పరిస్థితి. దీనినిబట్టి చూస్తే ఎగువ జలాశయాలు నిండి, తర్వాత దిగువకు నీరు వస్తేకానీ ధైర్యంగా ఖరీఫ్ సాగు చేపట్టలేని పరిస్థితి. అయితే నిన్నటి వరకు రైతుల్లో ఇదే ఆందోళన. అయితే చంద్రబాబు వచ్చాక పట్టిసీమ ఆదుకుంటుందన్న నమ్మకం రైతుల్లో పెరిగింది.

యుద్ధప్రాతిపదికన పట్టిసీమను బాగుచేస్తేనే...

ప్రస్తుతం కృష్ణా బేసిన్‌లోని ఎగువ జలాశయాల్లో ఉన్న నీటి మట్టాలను దృష్టిలో పెట్టుకుంటే, ఇప్పుడున్న ఒకే ఒక కీలక ఆధారం పట్టిసీమే. దీని కాల్వలను, మోటార్‌లను సరిచేసుకోగలిగితేనే నీరందే పరిస్థితి ఉంది. అయితే దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టిపెడితేనే ఈ ఖరీఫ్ కష్టాలు తీరే పరిస్థితి. కృష్ణా నదిలో నీటి వరద కంటే, గోదావరిలో ఏటా వృధాగా పోతున్న వరదనీరే ఎక్కువ కావటం, వాటిని సద్వినియోగం చేసుకునేందుకు 2016లో పట్టిసీమను అప్పటి సీఎం చంద్రబాబు ప్రారంభించటంతో కృష్ణా డెల్టాకు ఊపిరి పోసినట్టయింది. అయితే 2016లో 56 టీఎంసీలు, 2017లో 71 టీఎంసీలు, మిగిలిన సీజన్‌లలో 80 టీఎంసీల వరకు నీటిని తీసుకుని డెల్టాసాగును గట్టెక్కించారు. అయితే వైసీపీ సర్కారు అధికారంలోకి ఇచ్చాక ఈ ఐదేళ్లలో కేవలం 2023లో మాత్రమే పట్టిసీమను ఉపయోగించారు. అప్పట్లో కేవలం 17 టీఎంసీల నీటినే రెండు దఫాలుగా తీసుకున్నారు. మిగిలిన సీజన్‌లలో గోదావరి జలాలను అందించింది లేదు. గత ఏడాది భారీగా నీటి కరవు ఏర్పడటంతో డెల్టాలో రైతులు ఖరీఫ్, రబీ కోసం భూగర్భ జలాలను విచ్చలవిడిగా వాడేశారు. పట్టిసీమ సీజన్ సమయానికి ఏ ఆటంకం లేకుండా ఎంతవరకు ఉపయోగ పడుతుందనే విషయాన్ని నీటి పారుదల శాఖ పరిశీలించటంతోపాటు, మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన చేయగలిగితేనే ఈ సీజన్‌కు సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంది. సాగుకూడా ఆలస్యం కాకుండా గట్టెక్కే పరిస్థితి ఉంది. కొంత ఆలస్యం అయినా ఎగువ రాష్ట్రాల్లో వర్షాలు పడితే జలాశయాలు నిండే పరిస్థితి ఉంది. నాట్లు వేసే సమయానికి కానీ, పైరు ఎదుగుతున్న తరుణంలో కానీ కృష్ణా నది నీరు అందినా ఈ ఖరీఫ్ గట్టెక్కినట్టే.



పొడుబెట్టారు..


నీటిలో మునిగిపోయిన సెక్రటేరియట్ భవనాల పునాదులు

నీటిపాలైన నూతన భవనాల పునాదులు

రాజధాని నిర్మాణంలో అత్యంత కీలకమైన సెక్రటేరియట్ జంట భవనాలకు వేసిన పునాదులు పనికి వస్తాయా లేదా అన్నది ఇప్పుడు సమాధానం వెతుక్కోవాల్సిన ప్రశ్నగా మారింది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో 72 రెండు గంటలపాటు, అంటే మూడు రోజులపాటు నిర్విరామంగా ఆ భవనాలకు పునాదులు వేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించారు. అంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన భవనాల పునాదులు గత ఐదేళ్లుగా నీళ్లలోనే నానిపోతున్నాయి. ఇప్పుడు ఆ పునాదులు ఎంత వరకూ పటిష్టంగా వుంటాయన్నది తేలాల్సి వుంది. ఆకాశ హర్మ్యాలుగా వున్న ఆ భవనాలను నిర్మించడానికి ఆ పునాదులు అసలు పనికి వస్తాయా లేదా అన్నది కూడా తెలియాల్సి వుంది. దానిపై ఇంజనీరింగ్ అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం. ఆ పునాదులు పనికిరాకుండా పోతే వందల కోట్ల భారం పెరిగినట్లే చెప్పుకోవాలి. దాంతోపాటు అమరావతిలో కీలక రహదారులు, వంతెనల కోసం నిర్మించిన పునాదులు కూడా ఐదేళ్లుగా నీళ్లలో నానిపోతున్నాయి. వాటి పరి స్థితి ఏమిటన్నది తెలియాల్సి వుంది. ఇదిలా వుండగా అమరావతిలోని ప్రభుత్వ భవనాలు మధ్యలోనే నిలిచిపోయాయి. వాటి నిర్మాణంలో వినియోగించిన ఇనుము చాలా వరకూ దొంగల పాలైంది. మిగిలినది ఏదైనా వుందంటే అది తుప్పు పట్టిపోయింది. వాటన్నింటినీ పునరుద్ధరించడం మరింత భారం కాబోతోంది. మొత్తంగా వైసీపీ నిర్వాకం కారణంగా కొన్ని వేల కోట్ల రూపాయల భారం ప్రభుత్వంపై పడుతోంది. ఆ భారం మొత్తం రాష్ట్ర ప్రజలే మోయాల్సి వస్తుంది.

- గత ప్రభుత్వ నిర్వాకంతో కొండంత నిర్మాణ భారం
- జంగిల్ క్లియరెన్స్‌కే వందల కోట్లు వెచ్చించాల్సిన పరిస్థితి
- దెబ్బతిన్న రహదారులు, కుంగిపోయిన రోడ్లు
- శిథిల భవనాల పునరుద్ధరణకూ తప్పని అధిక వ్యయం
- నీళ్లలో సెక్రటేరియట్ భవన పునాదులు, వంతెనలు
- పనికివస్తాయా లేదా అన్నదాన్ని బట్టి మారనున్న అంచనాలు

గుంటూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాజధాని నిర్మాణం అనుకున్న విధంగా జరిగివుంటే నేడు అద్భుత నగరంగా ఆవిష్కృతమై వుండేది. కానీ గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకం, నిర్లక్ష్యం ఫలితంగా అమరావతి నిర్మాణం దారుణంగా దెబ్బతింది. 2015 నుంచి 2019 వరకూ జరిగిన నిర్మాణాలు, అమరావతి అభివృద్ధి అదేవిధంగా కొనసాగి వుంటే అయ్యే ఖర్చు కంటే ఇప్పుడు మరింత ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. 2019 తరువాత నిర్మాణాలను కొనసాగించివున్నా, కనీసం నవనగరం అడవిగా మారిపోకుండా, భవనాలు శిథిలమైపోకుండా సంరక్షణ చర్యలు చేపట్టి వున్నా నిర్మాణ వ్యయం అంతలా పెరిగేది కాదన్నది నిర్మాణ నిపుణులు చెబుతున్న మాట! కానీ వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా నవనగర నిర్మాణం నేడు మరింత భారంగా మారింది. ఆ భారమంతా ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం పైనే పడనుంది.


సీడ్ యాక్సిస్ రోడ్డు నుంచి ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రోడ్డు దుస్థితి

జంగిల్ క్లియరెన్సుకే వందల కోట్ల వ్యయం

దాదాపు 29 గ్రామాల్లో నిర్మితమవుతున్న అమరావతి మొత్తం నేడు అడవిలా మారిపోయింది. ఐదేళ్లుగా ఎలాంటి కార్యకలాపాలు లేకపోవడంతో కంపచెట్లు మొలిచాయి. దాదాపు 20, 30 అడుగుల ఎత్తున్న కంపచెట్లతో ఆ ప్రాంతమంతా చిట్టడవిని తలపిస్తోంది. రోడ్లు మొదలు, ప్రభుత్వ భవనాలు, రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ వాణిజ్య, నివాస ప్లాట్లు మొత్తం చిల్ల కంపలతో నిండిపోయాయి. మంత్రులు, న్యాయమూర్తుల భవనాల చుట్టూ పదడుగుల ఎత్తులో జమ్ము, రెల్లు గడ్డి పెరిగిపోయింది. ఏకంగా భవనాలపైనే మొక్కలు పెరిగుతున్నాయి. వందల కొద్దీ పొక్లెయినర్లు నెలల తరబడి పనిచేస్తే తప్ప ఈ కంపను తొలగించలేరు. కంపను తొలగించడం, దాన్ని తరలించడం అనేది అత్యంత వ్యయప్రయాసగా మారబోతోందని అధికారవర్గాలు చెబుతున్నాయి.

ఘోరంగా దెబ్బతిన్న రహదారులు

రాజధానిలో ప్రతి ప్రాంతాన్ని, ప్రతి కార్యాలయాన్ని కలుపుతూ సీడ్ యాక్సిస్ రోడ్డుతో పాటు డజన్ల కొద్దీ అంతర్గత రహదారులు వున్నాయి. గత ఐదేళ్లుగా ప్రభుత్వ కార్యకలాపాలు లేకపోవడంతో ఆ రోడ్లపై వాహనాలు తిరిగిన దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాజధాని నిర్మాణ పనులు వేగం పుంజుకోవడంతో వాహనాల రాకపోకలు మొదలయ్యాయి. గత ఐదేళ్లుగా రోడ్ల నిర్వహణ లేకపోవడంతో రోడ్లన్నీ అంతర్గతంగా దెబ్బతినిపోయాయి. చాలా చోట్ల కోతలకు గురయ్యాయి. సీడ్ యాక్సిస్ రోడ్డు చివరి భాగాలు కుంగిపోయి విరిగి పడిపోతున్నాయి. భూకంప సమయంలో చీలిపోయినట్లుగా అంతర్గత రహదారులు చీలిపోయి, నెర్రెలిచ్చి అత్యంత ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. ఇప్పుడు ఆ రోడ్లన్నీ పునాదుల దగ్గర నుంచి మళ్లీ నిర్మాణం చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా గతంలో రోడ్ల నిర్మాణం కోసం ఖర్చు చేసిన మొత్తం వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా బూడిదలో పోసిన పన్నీరుగా మారిపోయింది. చాలా చోట్ల రోడ్లు తవ్వుకుని గులకరాయి, కంకరను కూడా కొల్లగొట్టుకుపోయిన పరిస్థితులు కళ్ల ముందే వున్నాయి. అది కూడా మరింత భారం.


అడుగులోతు గుంతగా మారిన తుళ్లూరు- అమరావతి రోడ్డు


జంగిల్ క్లిరెన్స్ తర్వాత సీడ్ యాక్సెస్ రోడ్డు

నరేంద్రకు.. చీఫ్ విప్



- నేడో రేపో అధికారిక ప్రకటన
- ఆరోసారి గెలిచినందుకు తగిన గుర్తింపు
- కుల సమీకరణల్లో దక్కని అమాత్య పదవి

గుంటూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌కు శాసనసభలో ప్రభుత్వ చీఫ్‌విప్ పదవి దాదాపు ఖరారైనట్లు సమాచారం. నేడో, రేపో అధికారికంగా ప్రకటన వెలువడే అవకాశం ఉంది. పొన్నూరు నియోజకవర్గం నుంచి గెలుపొందిన నరేంద్ర ఆరోసారి శాసనసభలో అడుగుపెడుతున్నారు. గత వైసీపీ గాలిలో మినహా ఆయన ఆ నియోజకవర్గం నుంచి గెలుస్తూ వచ్చారు. గత ఎన్నికల్లో కూడా ఆయన స్వల్ప తేడాతో విజయావకాశాన్ని చేజార్చుకున్నారు. కేవలం 1112 ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు. ఓడిన నాటి నుంచి కూడా ఆయన నియోజకవర్గాన్ని అంటిపెట్టుకొని ఉండి సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న కిలారి రోశయ్య అరాచకాలను ఎప్పటికప్పుడు తప్పు పడుతూ ప్రజల పక్షాన ఉండి పోరాటం చేస్తూ వచ్చారు. అంతేకాకుండా ముఖ్యమంత్రి జగన్ తీరుపై కూడా అనేక పర్యాయాలు ధ్వజమెత్తుతూ విమర్శలు చేసేవారు. ఆయనపై కక్షతోనే సంగం డెయిరీ వ్యవహారంలో తలదూర్చి అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయించి జైలు పాలు చేసినా నరేంద్ర తొణక్కుండా వైసీపీ పాలనను ఎండగడుతూ వచ్చారు. ముఖ్యంగా గత ఐదేళ్ళుగా పొన్నూరు ఎమ్మెల్యేగా ఉన్న రోశయ్య క్వారీల్లో అక్రమ తవ్వకాలు చేస్తూ ఎంతటి అవినీతికి పాల్పడింది తన పోరాటం ద్వారా నరేంద్ర వెలుగులోకి తీసుకురావటం జరిగింది. ఏకంగా ఆయనే క్వారీల వద్దకు వెళ్ళి అక్రమ తవ్వకాలను అడ్డుకునే ప్రయత్నం చేయటం జరిగింది. అందువల్లే రోశయ్య తిరిగి అక్కడ పోటీ చేస్తే గెలిచే అవకాశాలు ఉండవనే జగన్ భావించి అతన్ని గుంటూరు ఎంపీగా పోటీ చేయించాడు. ఎంపీ ఎన్నికల్లో కూడా రోశయ్య ఘోర పరాజయాన్ని చవి చూడాల్సి వచ్చింది. ఈ ఎన్నికల్లో పొన్నూరు నుంచి వైసీపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన అంబటి మురళీకృష్ణను నరేంద్ర ఓడించి 32వేలకు పైగా ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. ఈ పర్యాయం నరేంద్రకు మంత్రివర్గంలో చోటు లభిస్తుందని ఆయన అభిమానులు భావించారు. ఆయన కూడా అదే ఆశ పెట్టుకున్నారు. అయితే పొత్తులు, కుల సమీకరణల మూలంగా మంత్రి పదవి దక్కలేదు. కాగా తన తండ్రి, మాజీ మంత్రి ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి మరణానంతరం రాజకీయ అరంగేట్రం చేసి ఆ నాటి నుంచి ఈ నాటి వరకు పార్టీని వీడకుండా అప్పట్లో కాంగ్రెస్, ఆ తరువాత వైసీపీపై పోరాటం చేస్తూ పార్టీకి అండగా ఉంటున్న నరేంద్రకు తగిన గుర్తింపు కల్పించేందుకు చీఫ్‌విప్ పదవి కట్టబెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

భక్తి శ్రద్ధలతో బక్రీద్

- ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు

నరసరావుపేట, జూన్ 17 : జిల్లా అంతటా బక్రీదు పర్వదినాన్ని సోమవారం అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వేలాది మంది ముస్లింలు ప్రార్థనలకు హాజరయ్యారు. నరసరావుపేట ప్రకాష్ నగర్‌లోని ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. వేలాది మంది ముస్లింలు ఈద్గాలో జరిగిన ప్రార్థనలలో పాల్గొన్నారు. పేష్మాం రజా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి బక్రీదు పర్వదిన సందేశాన్ని ఇచ్చారు. ప్రార్థనల అనంతరం ఒకరికొకరు బక్రీదు పర్వదిన శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీసు శాఖ ఈద్గా వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసింది. గుంటూరు రోడ్డులోని పెద మసీదు, పట్టణంలోని వివిధ మసీదులలో కూడా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రార్థనలలో పాల్గొని బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. జనసేన నరసరావుపేట నియోజవర్గ ఇన్‌చార్జ్ సయ్యద్ జిలానీ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.


ప్రార్థనల్లో ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

దిక్సూచి DIKSUCHI



ఎవర్ గ్రీన్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్

కంటికి కనిపించదు, ప్రభావం మాత్రమే అనుభవంలోకి వస్తుంది. అదే విద్యుత్తు. ఇంట్లో బల్బు వెలగడం నుంచి నీళ్ళు పైకి ఎక్కించేందుకు ఉపయోగించే మోటారు పనిచేయడం వరకు దీనికి ఎన్నో ఉదాహరణలు చెప్పుకోవచ్చు. ఆ వ్యవహారాన్నంతటినీ ఒక గొడుగు కిందకు తీసుకువస్తే అదే ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్. దీనికి సంబంధించిన కెరీర్ వివరాలను చూద్దాం.

కెరీర్ అవకాశాలు అధికంగా ఉన్న ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ వాస్తవానికి ప్రాక్టికల్ డిసిప్లిన్. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఇంజనీర్లు కలగలిసి రీసెర్చ్ - డెవలప్‌మెంట్ సంస్థలు మొదలుకుని అభివృద్ధి చెందుతున్న పరిశ్రమలు, ఇంజనీరింగ్ సర్వీసెస్ సంస్థలు, మాన్యుఫాక్చరింగ్, ప్రభుత్వ, టెక్ కంపెనీల్లో పనిచేయవచ్చు. 2021-2031 మధ్య పదేళ్ళలో ఈ పరిశ్రమ ఎదుగుదల మూడు శాతంగా లెక్కగట్టారు. మన దేశంలో ఏటా సగటున ఇరవై వేల కంటే కొద్దిగా ఎక్కువ ఉద్యోగాలు ఈ పదేళ్ళలో వీరికి లభిస్తాయి. ప్రజలందరూ వేలం వెర్రిగా కంప్యూటర్ వైపు వెళుతుండడంతో, వీరికి జాబ్ గ్యారెంటీ లభిస్తోంది అనే చెప్పాలి.

షన్, ఆసుపత్రుల్లో సోఫిస్టికేటెడ్ మెడికల్ ఎక్విప్‌మెంట్స్‌కు తోడు ప్రభుత్వ విభాగాల్లో అవకాశాలు ఉంటాయి. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఎఎల్ఎస్‌టిఒఎం ఇండియా లిమిటెడ్, స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డ్, బీహెచ్‌ఈఎల్, ఎబిబి ట్రాన్స్‌ఫార్మర్స్ అండ్ ఎలక్ట్రికల్స్, ఎన్‌టీపీసీ, జీఈ, ప్రభుత్వ కళాశాలల్లో టీచింగ్, హెచ్ఏఎల్, డీఆర్‌డీఓ, ఎల్ అండ్ టీ, ఇస్రో, క్రాంప్టన్ గ్రీవ్స్ పవర్ అండ్ ఇండస్ట్రియల్ సొల్యూషన్స్ లిమిటెడ్, నేషనల్ హైడ్రోఎలక్ట్రిక్ పవర్, సీడేక్, ఓఎన్‌జీసీ, ఐఓఎల్, ఇస్రో, ఐఓసీఎల్, బజాజ్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్, పీడబ్ల్యూడీ, టీపీసీఎల్, సైమన్స్, హెచ్‌పీసీఎల్, జిందాల్ స్టీల్ అండ్ పవర్, హార్బర్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్, ఇండియన్ రైల్వేస్- ఆర్‌బీ టాటా స్టీల్, ఇరిగేషన్ విభాగం, గెయిల్, టాటా మోటార్స్, సెయిల్, టాటా రిఫ్రాక్టరీస్ లిమిటెడ్, హెచ్‌బిఎల్ పవర్ సిస్టమ్స్ లిమిటెడ్, యునైటెడ్ ఎలక్ట్రికల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, డిఫెన్స్ సర్వీసెస్, రిలయన్స్ పవర్, ట్రాకో కేబుల్ కంపెనీ లిమిటెడ్, నాల్కో, మైక్రాన్ ఎలక్ట్రికల్స్, బీడీఎల్, హాలోనిక్స్ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, విప్రో లైటింగ్, ఎన్ఎండీసీలో అవకాశాలు ఉంటాయి. కోర్ ఎలక్ట్రికల్ కంపెనీలకు తోడు యాపిల్, ఐబీఎం, గూగుల్, శాంసంగ్, మైక్రోసాఫ్ట్, సోనీ కార్పొరేషన్, తోషిబా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, సీటీఎస్, ఒరాకిల్, ఇంటెల్, బోచ్, ఎరిక్సన్, హెచ్‌పీ తదితరాల్లోనూ వీరికి అవకాశాలు ఉంటాయి. టెక్నోపార్క్‌లోని వివిధ ఐటీ సంస్థలు, స్మార్ట్ సిటీ, టెక్నోసిటీ, సైబర్ పార్క్, ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్, నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్, కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, బెల్, సీడాక్, సీఎస్ఐఆర్, సెంట్రల్ పవర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ కూడా ఎలక్ట్రికల్ ఇంజనీర్లకు అవకాశాలు కల్పిస్తాయి.

- అవకాశాల విషయానికి వస్తే ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్లకు ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, కంట్రోల్ సిస్టమ్, సిస్టమ్ మేనేజ్‌మెంట్, ప్రొడక్ట్ డిజైన్, సేల్స్, కన్జూమర్ ఎలక్ట్రానిక్స్, ట్రాన్స్‌పోర్టేషన్, వైర్‌లెస్ కమ్యూనికేషన్, మాన్యుఫాక్చరింగ్, కెమికల్, ఆటోమోటివ్, డిఫెన్స్, స్పేస్ రీసెర్చ్ తదితర సంస్థల్లో అవకాశాలు ఉంటాయి. నిర్దేశిత ప్రొఫెషన్‌కు మాత్రమే వీరు పరిమితం కారు కూడా.
- భిన్న రంగాలు అంటే హౌస్‌హోల్డ్ అప్లయిన్సెస్ డివిజన్, భవన నిర్మాణాల్లో ఎలక్ట్రికల్ సిస్టమ్ డిజైన్, ఎలక్ట్రిక్ వెహికల్స్/ కార్లు, రైల్వేస్, ఎయిర్‌పోర్ట్స్, రోబోటిక్స్, ఏరోస్పేస్, సోఫిస్టికేటెడ్ మెడికల్ ఎక్విప్‌మెంట్స్, ఎలక్ట్రిక్ పవర్ జనరేటింగ్ - ట్రాన్స్‌మిషన్ - డిస్ట్రిబ్యూషన్ సంస్థల్లో కెరీర్ అవకాశాలు ఉంటాయి.

సంబంధిత బ్రాంచీలు

ఎలక్ట్రికల్ అండ్ కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్(పవర్ సిస్టమ్), ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ పవర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్(ఎలక్ట్రానిక్స్ అండ్ పవర్), ఎలక్ట్రికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ పవర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ అండ్ పవర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కంట్రోల్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ పవర్ ఇంజనీరింగ్, పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, పవర్ ఇంజనీరింగ్ ఉన్నాయి.

కెరీర్ అవకాశాలు

ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చదివిన వారికీ అనేకానేక అవకాశాలు ఉన్నాయి. హౌస్‌హోల్డ్ అప్లయిన్సెస్ డిజైనింగ్, భవనాలకు ఎలక్ట్రికల్ సిస్టమ్ డిజైన్, రైల్వేలు, విమానాశ్రయాలు, రోబోటిక్స్, ఏరోస్పేస్, ఎలక్ట్రిసిటీ జనరేషన్ - ట్రాన్స్‌మిషన్ - డిస్ట్రిబ్యూ

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/icJV8shలో చదవండి.

ప్రయోజనాలు

ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ తరవాత ప్రపంచంలో ఎక్కడైనా పనిచేసే అవకాశం ఉంటుంది. మేథ్స్, ఫిజిక్స్ సహా ఎలక్ట్రికల్ అప్లికేషన్స్‌కు సంబంధించిన గైడింగ్ ప్రిన్సిపల్స్‌లో మార్పు ఉండనందున గ్లోబల్ కంపెనీలన్నీ వీరిని తీసుకుంటాయి. అవసరమైన నైపుణ్యాలు ఉన్న ఎలక్ట్రికల్ ఇంజనీర్లకు విశ్వవ్యాప్తంగా డిమాండ్ ఉంది. అనుభవజ్ఞులకు మాదిరిగా ఎక్కువ వేతనాలు ఉండవు. అయితే ఫ్రెషర్స్‌ను కూడా మల్టీనేషనల్ కంపెనీలు తీసుకుని తమకు అవసరమైన రీతిలో శిక్షణ ఇచ్చుకుంటాయి. కొన్ని కంపెనీలు వీరిని తీసుకుని స్కిల్ పెంచే కార్యక్రమాలను చేపడుతున్నాయి. కొద్దికాలం అనుభవం గడించిన తరవాత ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్ చేసి పొజిషన్‌ను మెరుగుపర్చుకోవచ్చు.

- అలాగే ఈ కెరీర్‌లో ఇన్నోవేషన్‌కు అవకాశం ఉంటుంది. ఇది డెస్క్ జాబ్ కాదు అన్న విషయాన్ని గుర్తు పెట్టుకుంటే నైపుణ్యాల పెంపు, అనుభవం, క్రియేటివిటీతో ఎంత ఎత్తుకు ఎదగవచ్చో అర్థమవుతుంది. కొవిడ్ కాలంలో అందరూ ఇళ్ళకు పరిమితమైనప్పటికీ వీరికి తీరికలేదంటే అతిశయోక్తి కాదు. అంతరాయం లేకుండా విద్యుత్తు, వైఫై వంటి సదుపాయాలను కలిగించడంలో ఎలక్ట్రికల్ ఇంజనీర్లు ఎంతో కృషి చేశారన్నది వాస్తవం. ఆరోగ్య పరిరక్షణలో అంటే అప్పట్లో ఆసుపత్రులకు అవసరమైన విద్యుత్తు సరఫరా, ఎలక్ట్రిసిటీతో పనిచేసే పరికరాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చేయడంలో వీరి పాత్ర అమోఘం. ఆర్థికమాంద్యానికి సైతం తలొగ్గని కెరీర్. మల్టీ డైమన్షనల్ కెరీర్ ఆప్షన్స్ ఉన్నాయి. ఇందుకోసం పోర్ట్‌ఫోలియోను పెంచుకోవాలి. పవర్ ఇంజనీరింగ్, మైక్రో ఎలక్ట్రానిక్స్ టెలికమ్యూనికేషన్స్ రేడియో ఫ్రీక్వెన్సీ ఇంజనీరింగ్ ఈ ఆప్షన్స్‌లో కొన్ని. మల్టిపుల్ స్పెషలైజేషన్స్‌తో భిన్న కెరీర్లకు తద్వారా ఎదిగే అవకాశం ఎలక్ట్రికల్ ఇంజనీర్లకు ఉంటుంది.
- ఏతావతా ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ఏమంత గొప్ప కెరీర్ కాదన్న అపోహ ఉంది. అది తప్పు అనడానికి పై ఉదాహరణలే చాలు.



ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావు
డైరెక్టర్, ఎన్ఐటి రాయపూర్

ఆర్‌జీఐపీటీలో బీటెక్, ఐడీడీ

అమేథీలోని రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం టెక్నాలజీ (ఆర్‌జీఐపీటీ)- బీటెక్, ఇంటిగ్రేటెడ్ డ్యూయల్ డిగ్రీ(ఐడీడీ) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. జేఈఈ(అడ్వాన్స్‌డ్) 2024/జేఈఈ (మెయిన్) 2024 స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. బీటెక్ వ్యవధి నాలుగేళ్లు. ఐడీడీ వ్యవధి అయిదేళ్లు. ఇందులో బీటెక్, ఎంటెక్/ఎంఎస్ డిగ్రీలు పొందవచ్చు. మొత్తం 600 సీట్లు ఉన్నాయి. అదనంగా 106 సూపర్‌న్యూమరరీ సీట్లను మహిళలకు ప్రత్యేకించారు.

బీటెక్ స్పెషలైజేషన్‌లు-సీట్లు: కెమికల్ 60, కెమికల్ ఇంజనీరింగ్(పెట్రో కెమికల్స్ అండ్ పాలిమర్స్ ఇంజనీరింగ్ 30, రెన్యూవబుల్ ఎనర్జీ ఇంజనీరింగ్ 30), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ 60, కంప్యూటర్ సైన్స్ అండ్ డిజైన్ ఇంజనీరింగ్ 50, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ 50, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ 50, మెకానికల్ 30, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ 50, మేథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్ 60, పెట్రోలియం ఇంజనీరింగ్ 60, పెట్రోలియం ఇంజనీరింగ్(అప్లయిడ్ పెట్రోలియం జియోసైన్స్) 20.

ఐడీడీ స్పెషలైజేషన్‌లు-సీట్లు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ అండ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ 40, పెట్రోలియం ఇంజనీరింగ్ అండ్ పెట్రోలియం & నేచురల్ గ్యాస్ ఇంజనీరింగ్ 10.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 60 శాతం మార్కులతో ఇంటర్(ఎంపీసీ)/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణతతోపాటు జేఈఈ(అడ్వాన్స్‌డ్) 2024 అర్హత పొందిన అభ్యర్థులు, కనీసం 80 శాతం మార్కులతో ఇంటర్(ఎంపీసీ)/తత్సమాన కోర్సు ఉత్తీర్ణతతోపాటు జేఈఈ(మెయిన్) 2024 అర్హత పొందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. జేఈఈ అడ్వాన్స్‌డ్ అభ్యర్థులకు ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది. సీట్లు మిగిలిన పక్షంలో మాత్రమే జేఈఈ మెయిన్ 2024 అభ్యర్థులను పరిగణనలోకి తీసుకుంటారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు సడలింపులు వర్తిస్తాయి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1416; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీలకు రూ.708
- **మొదటి రౌండ్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 7
- **మొదటి రౌండ్‌లో ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూలై 9
- **మొదటి రౌండ్ అభ్యర్థులు అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 15
- **సెకండ్ రౌండ్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 16
- **సెకండ్ రౌండ్‌లో ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూలై 18
- **సెకండ్ రౌండ్ అభ్యర్థులు అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 27
- **క్యాంపస్ రిపోర్టింగ్:** ఆగస్టు 9
- **రిజిస్ట్రేషన్:** ఆగస్టు 10
- **ఓరియంటేషన్ ప్రోగ్రామ్:** ఆగస్టు 10, 11
- **తరగతులు ప్రారంభం:** ఆగస్టు 12 నుంచి
- **వెబ్‌సైట్:** rgipt.ac.in

ఎన్‌జీ రంగా వర్సిటీలో డిప్లొమాలు

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ- డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అగ్రికల్చర్, సీడ్ టెక్నాలజీ, ఆర్గానిక్ అగ్రికల్చర్ విభాగాల్లో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ వ్యవధి మూడేళ్లు. పదోతరగతి/తత్సమాన పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రభుత్వ పాలిటెక్నిక్‌లతోపాటు అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిప్లొమాలు-సీట్లు

- డిప్లొమా ఇన్ అగ్రికల్చర్-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 578 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 1900 సీట్లు ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ సీడ్ టెక్నాలజీ-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 25 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 260 సీట్లు ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ ఆర్గానిక్ అగ్రికల్చర్-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 25 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 40 సీట్లు ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 60 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 330 సీట్లు ఉన్నాయి.
- కనీసం నాలుగేళ్లు గ్రామీణ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు 75 శాతం సీట్లు, పట్టణ ప్రాంతాల్లో చదివినవారి కోసం 25 శాతం సీట్లు ప్రత్యేకించారు. మొత్తం సీట్లలో 85 శాతం సీట్లను స్థానికులకు నిర్దేశించారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

అర్హత వివరాలు: ఆంధ్రప్రదేశ్/తెలంగాణ స్టేట్ బోర్డు లేదా సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ/ఎన్ఐఓఎస్/ఏపీఓఎస్ఎస్/టీఓఎస్ఎస్ నుంచి పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి కంపార్ట్‌మెంటల్ అభ్యర్థులు; ఇంటర్ ఫెయిల్/మధ్యలో ఆపేసినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ ఉత్తీర్ణులు/ఆపై చదివినవారు దరఖాస్తుకు అనర్హులు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **చివరి తేదీ:** జూన్ 20
- **వెబ్‌సైట్:** angrau.ac.in

ఐఐఐటీఎంలో ఎంబీఏ

కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలోని అటల్ బిహారీ వాజపేయి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్(ఏబీవీ-ఐఐఐటీఎం), గ్వాలియర్- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో మార్కెటింగ్, ఫైనాన్స్, ఆపరేషన్స్, ఐటీ అండ్ సిస్టమ్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ అంశాలతోపాటు రీసెర్చ్ బేస్డ్ ఇంటర్న్‌షిప్ ఉంటుంది. క్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఆధారంగా ఎంపిక చేసిన అభ్యర్థులకు గ్రూప్ డిస్కషన్స్, రైటింగ్ కాంప్రహెన్షన్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.



అర్హత: ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీ స్థాయిలో మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. చివరి సంవత్సర పరీక్షలు రాసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. క్యాట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ ఓబీసీ అభ్యర్థులకు రూ.1,000; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500.
- **ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 20
- **అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ:** జూలై 3
- **అడ్మిషన్ పొందిన అభ్యర్థుల జాబితా విడుదల:** జూలై 4
- **అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 11
- **స్పీడ్ పోస్ట్ ద్వారా దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, ఏబీవీ-ఐఐఐటీఎం గ్వాలియర్ - 474015
- **వెబ్‌సైట్:** www.iiitm.ac.in

నవ్య | చిత్రజ్యోతి

'భైరవ యాంథమ్' వచ్చేసింది



ప్రభాస్ నటించిన 'కల్కి 2898 ఏడీ' నుంచి మొదటి సింగిల్ 'భైరవ యాంథమ్' పూర్తి లిరిక్ వీడియో సోమవారం విడుదలైంది. సినిమా ప్రచారంలో భాగంగా ఈ పాటను విడుదల చేసిన మేకర్స్.. ఈ సాంగ్‌ను భారతదేశపు అతిపెద్ద పాటగా పేర్కొన్నారు. ప్రభాస్, పంజాబీ సింగర్ దిల్జీత్ దోసాంజే ఈ పాటలో ఆకట్టుకునే వేషధారణతో తలపాగాలు ధరించి సందడి చేశారు. కథానాయకుడి పాత్ర తీరు తెన్నులను ప్రేక్షకులకు పరిచయం చేసేలా సాగే ఈ పాటను రామజోగయ్య శాస్త్రి, కుమార్ రాశారు. తెలుగుతో పాటు హిందీ లిరిక్స్ కలగలసిన ఈ సాంగ్‌ను పంజాబీ సింగర్ దిల్జీత్ దోసాంజే, విజయనారాయణ్ సంయుక్తంగా ఆలపించగా, సంతోశ్ నారాయణన్ సంగీతం అందించారు. కాగా, ఈ సినిమాకు నాగ్‌అశ్విన్ దర్శకత్వం వహించగా, అశ్వనీదత్ నిర్మించారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొణె, దిశా పటానీ వంటి భారీ తారాగణం నటించిన 'కల్కి 2898 ఏడీ' ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకు రానుంది.



డేట్ మారింది!



అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'పుష్ప 2' చిత్రాన్ని ఆగస్టు 15న విడుదల చేస్తున్నట్లు చిత్ర నిర్మాతలు నవీన్ ఎర్నేని, రవిశంకర్ వై ఇంతకుముందు ప్రకటించారు. అయితే షూటింగ్ పార్ట్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు ఇంకా పూర్తి కాకపోవడం, క్వాలిటీ విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా, టెక్నికల్‌గా మరింత అత్యున్నత విలువలతో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే ఉద్దేశంతో విడుదల తేదీని మార్చామనీ, డిసెంబర్ 6న సినిమా రిలీజ్ అవుతుందని నిర్మాతలు తాజాగా వెల్లడించారు. రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం నుంచి ఇంతవరకూ విడుదలైన 'పుష్పరాజ్' టైటిల్ సాంగ్, 'సూసేకి అగ్గిరవ్వ మాదిరి ఉంటాడే నా సామి' అనే కపుల్ సాంగ్ సంచలనం సృష్టించాయి. ఈ రెండు పాటల తర్వాత సినిమా మీద అంచనాలు మరింత పెరిగాయి. 'పుష్ప 2' కోసం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అందుకే దర్శకుడు సుకుమార్ విడుదల విషయంలో తొందర పడకుండా మేకింగ్ విషయంలో మరింత శ్రద్ధ తీసుకుని చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు.

వరుణ్ కెరీర్‌కు మైలురాయిగా మారుతుంది



వరుణ్ సందేశ్ నటించిన లేటెస్ట్ చిత్రం 'నింద'. కాండ్రకోట మిస్టరీ ఉప శీర్షిక. రాజేశ్ జగన్నాథం స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. యదార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన 'నింద' చిత్రం ఈ నెల 21న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హీరో నిఖిల్ మాట్లాడుతూ "ఈ సినిమా వరుణ్‌సందేశ్ కెరీర్‌కు మైలురాయిగా మారుతుంది. అందరూ సినిమాను పెద్ద సక్సెస్ చేయాలి" అని కోరారు. "ఇన్నేళ్ల కెరీర్‌లో నా మనసుకు బాగా దగ్గరైన చిత్రం 'నింద'" అని వరుణ్ సందేశ్ చెప్పారు. "'నింద' మూవీ వరుణ్ కమ్‌బ్యాక్‌కు నాంది పలుకుతుంది" అని దర్శకనిర్మాత రాజేశ్ జగన్నాథం అన్నారు.

యాక్షన్ షో రీల్



రవితేజ, దర్శకుడు హరీశ్‌శంకర్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ 'మిస్టర్ బచ్చన్' చిత్రం ప్రమోషన్స్‌లో భాగంగా షో రీల్‌ను సోమవారం విడుదల చేశారు. ఎలాంటి డైలాగులు లేకపోవడం ఈ రీల్ ప్రత్యేకత. పాత్రలను పరిచయం చేస్తూ ఆసక్తికరంగా ఇది ఉంది. రవితేజ స్టైలిష్, మాస్ క్యారెక్టర్‌లో కనిపించారు. ఆయన గెటప్ క్లాసటచ్‌తో ఉంది. ఆయన పాల్గొన్న యాక్షన్ సీన్లు మాస్‌ని ఆకట్టుకునేలా ఉన్నాయి. జగపతిబాబు ఓల్డ్ ఫెరోషియస్ మ్యాన్‌గా కనిపించారు. రీల్ చివరిలో రవితేజ అమితాబ్ బచ్చన్‌ను ఇమిటేట్ చేసే సీన్ ఆసక్తికరంగా ఉంది. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సచిన్ ఖేడ్కర్ కీలక పాత్రను పోషిస్తున్నారు. వీరిద్దరూ కూడా షో రీల్‌లో కనిపించారు. త్వరలోనే రిలీజ్ డేట్ ప్రకటిస్తామని చిత్ర నిర్మాత టీజీ విశ్వప్రసాద్ చెప్పారు. 'నామ్‌తో సునా హో గా' అనే ట్యాగ్‌లైన్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్, ఫొటోగ్రఫీ: అయనంక బోస్, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/KDSZqLa లో చదవండి.



కథ విన్నప్పుడే.. సక్సెస్‌ను ఊహించా

విజయ్ సేతుపతి



తెలుగులో మంచి ఫ్యాన్ బేస్‌ను సొంతం చేసుకున్న అతికొద్ది తమిళ నటుల్లో విజయ్ సేతుపతి ఒకరు. ఆయన నటించిన 50వ చిత్రం 'మహారాజా'. అనురాగ్ కశ్యప్, మమతా మోహన్‌దాస్, అభిరామి కీలక పాత్రలు పోషించారు. నిథిలన్ స్వామినాథన్ దర్శకత్వంలో సుధన్ సుందరమ్, జగదీశ్ పళనిసామి నిర్మించిన ఈ చిత్రం ఇటీవలే విడుదలై అన్ని వర్గాల ప్రేక్షకులని ఆకట్టుకుని.. హిట్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. ఈ సందర్భంగా సోమవారం చిత్రబృందం సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా మూవీ డైరెక్టర్ నిథిలన్ స్వామినాథన్ మాట్లాడుతూ "ఈ సినిమాలోని ఎమోషన్‌తో ప్రేక్షకులు చివరివరకూ ప్రయాణిస్తారు. ఈ సినిమాకి వస్తున్న రెస్పాన్స్ చాలా సంతోషాన్నిస్తోంది. ఈ సినిమాని ఇంతలా ఆదరించిన తెలుగు ప్రేక్షకులకు ధన్యవాదాలు" అని అన్నారు. "నన్ను సినిమా సినిమాకి మరింతగా ప్రేమిస్తున్న తెలుగు ప్రేక్షకులకి నా కృతజ్ఞతలు. ఈ సినిమా కథ విన్నప్పుడే ఇది అందరి మనసులని గెలిచే సినిమా అవుతుందని ఊహించా. ఈ సక్సెస్‌ని ప్రేక్షకులకి అంకితం చేస్తున్నాను" అని విజయ్ సేతుపతి చెప్పారు.

ఎర్ర గులాబీ



మలయాళ నటి హనీ రోజ్ లీడ్ రోల్ పోషిస్తున్న 'రేచల్' చిత్రం టీజర్ విడుదలైంది. వయలెన్స్, బ్లడ్ షెడ్ కలిగిన కథాంశమని ఈ టీజర్ చూడగానే అర్థమవుతుంది. నటిగా హనీ రోజ్‌కు ఉన్న అనుభవం, నైపుణ్యాన్ని ఈ సినిమా ఉపయోగించుకుంటోందనే విషయాన్ని ఈ టీజర్ వెల్లడించింది. నూతన దర్శకురాలు ఆనందిని బాలాను పరిచయం చేస్తూ బాదుషా ఎన్.ఎం, రాజన్ చిరాయిల్ నిర్మిస్తున్నారు. దర్శకుడు అబ్రిడ్ షైన్ ఈ సినిమాకు సహ నిర్మాత. మలయాళంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని తమిళ, తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేయనున్నారు. రాహుల్ మణప్పట్టు కథ అందించిన ఈ చిత్రానికి ఆయనతో పాటు అబ్రిడ్ షైన్ కూడా స్క్రీన్‌ప్లే తయారు చేశారు.



కాసు మహేష్‌రెడ్డి పేరుతో పిడుగురాళ్లలో వెలిసిన ఫ్లెక్సీ

కాసు.. నీ రాజకీయ సన్యాసం ఎప్పుడు ?

- పిడుగురాళ్లలో వెలసిన ఫ్లెక్సీలు
- మాజీ ఎమ్మెల్యేకు ఫోన్ చేస్తున్న కార్యకర్తలు

పిడుగురాళ్ల, జూన్17: ఓటమిని జీర్ణించుకోలేకపోతున్న వైసీపీ మాజీ ఎమ్మెల్యేలకు కొత్త సమస్య వచ్చిపడింది. ఎన్నికలకు ముందు అధికారం, పదవి శాశ్వతం అన్న భ్రమతో విసిరిన సవాళ్లు, తిప్పిన మీసాలు ఇప్పుడు తిప్పలు తెచ్చిపెడుతున్నాయి. గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిపై ఆ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఫ్లెక్సీలతో ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో పిడుగురాళ్ల పోలీస్‌స్టేషన్ వద్ద తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు దియ్యా రామకృష్ణప్రసాద్ పేరుతో సోమవారం ఒక ఫ్లెక్సీ వెలిసింది. ఎన్నికలకు ముందు ఓ టీవీ చానల్‌లో మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మధ్య సంవాదం జరిగింది. ఈ సందర్భంగా యరపతినేని తాను 2024 ఎన్నికలలో ఓడిపోతే రాజకీయ సన్యాసం చేస్తాను.. గెలిస్తే కాసు మహేష్‌రెడ్డి రాజకీయ సన్యాసం చేయాలని సవాల్ విసిరారు. టీవీ లైవ్ కార్యక్రమంలో వున్న కాసు మహేష్‌రెడ్డి కూడా ఈసారి కూడా గురజాల టీడీపీ అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావే కావాలని, ఆయన అయితేనే తాను సులువుగా ఓడిస్తానని.. ఒకవేళ ఓడించకపోతే యరపతినేని సవాల్ విసిరినట్లుగా రాజకీయ సన్యాసం చేస్తానని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారగా టీడీపీ కార్యకర్తలు నియోజకవర్గంలో ఏకంగా ఫ్లెక్సీలు వేయిస్తున్నారు. దియ్యా రామకృష్ణ వేయించిన ఫ్లెక్సీ చూసి చాలామంది కాసు మహేష్‌రెడ్డి వ్యక్తిగత ఫోన్‌కు కాల్‌చేసి రాజకీయ సన్యాసం ఎప్పుడు తీసుకుంటున్నారని నేరుగా అడుగుతుండటం గమనార్హం.

ప్రజా దర్బార్‌కు వినతుల వెల్లువ

- సమస్యల పరిష్కారానికై మంత్రి లోకేశ్ హామీ


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

మంగళగిరి, జూన్ 17: మంగళగిరి నియోజకవర్గ ప్రజల కోసం మంత్రి నారా లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఉండవల్లిలోని నివాసానికి చేరుకుని మంత్రి లోకేశ్‌కు తమ సమస్యలను విన్నవిస్తున్నారు. ఉదయం 7గంటల నుంచే వందలాదిమంది ప్రజలు వినతిపత్రాలతో బారులు తీరుతున్నారు. సోమవారం కూడా పలు సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు వెల్లువెత్తాయి. అంగన్‌వాడీలు, ఉపాధ్యాయులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను యువనేత దృష్టికి తీసుకువచ్చారు. వేతనాలు పెంచాలని అంగన్‌వాడీ టీచర్లు, బదిలీల కోసం ఉపాధ్యాయులు, ఉపాధి, ఉద్యోగాలను కల్పించాలని నిరుద్యోగుల నుంచి వినతులు అందాయి. విద్య, వైద్యఖర్చులకు ఆర్థికసాయం అందించాలని పలువురు విజ్ఞప్తి చేశారు. వైసీపీ నేతలు అధికారాన్ని అడ్డంపెట్టుకుని తమ భూములను బలవంతంగా లాక్కున్నారని, తమకు న్యాయం చేయాలని బాధితులు లోకేశ్‌ను కోరారు. సమస్యలన్నింటినీ వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషిచేస్తానని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు.

రైస్‌మిల్లులో రేషన్ బియ్యం!

- పోలీస్, సివిల్ సప్లయీస్ అధికారుల తనిఖీలు

పొన్నూరుటౌన్, జూన్ 17: పొన్నూరు మండలం వెల్లలూరు గ్రామంలో రైస్ మిల్లులో ఆదివారం సివిల్ సప్లయిస్, పోలీస్ అధికారులు రేషన్ బియ్యం కోసం తనిఖీలు నిర్వహించారు. రేణుక అంకమ్మ తల్లి ట్రేడర్స్ పేరుతో ఉన్న ఈ రైస్ మిల్లు నాన్ వర్కింగ్ కింద ఉన్నట్లు సమాచారం. మిల్లులో రేషన్ బియ్యం తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం అందటంతో రూరల్ ఎస్సై బండ్ల భార్గవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భారీఎత్తున బియ్యాన్ని గుర్తించిన అధికారులు మిల్లు నిర్వాహకులను వాటి గురించి ప్రశ్నించారు. మిల్లు నిర్వాహకులు బీపీటీ బియ్యం ఆడించి విక్రయాన్నికి తరలిస్తున్నట్లు సమాధానం ఇచ్చారు. కాగా మిల్లులో ఎట్టువంటి ఊక, తవుడు, నూకలు లేకపోవటంతో రేషన్ బియ్యాన్ని రీ సైక్లింగ్ చేసి తరలిస్తున్నారని అనుమానించిన పోలీసులు రెవెన్యూ, సివిల్ సప్లయ్స్ అధికారులకు సమాచారం అందించారు. సీఎస్‌డీటీ భువనేశ్వరి రెవెన్యూ సిబ్బంది సహకారంతో మిల్లులో తనిఖీలు ప్రారంభించారు. గత మార్చి నెలల్లో ప్రతిపాడులో పట్టుబడిన రేషన్ బియ్యం 450 క్వింటాళ్ల తమ మిల్లుకు అధికారులు తరలించారని వాటి వివరాలను అధికారులకు అందచేశారు.


వెల్లలూరు రైస్ మిల్లులో లోడింగ్‌కు సిద్ధంగా ఉన్న బియ్యం బస్తాలు


వేమవరం జడ్పీ హైస్కూల్లో పిచ్చిచెట్ల మధ్య వృధాగా పడివున్న జగనన్న భూరక్ష హద్దు రాళ్లు

ప్రజల సొమ్ము మట్టిపాలు

- ఎనిమిది రెవెన్యూ గ్రామాలకు 11 వేల హద్దురాళ్లు
- సుమారు రూ.55 లక్షలు వృధా

మాచవరం, జూన్17: గత రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందించాల్సిన స్థలాలను అందించకుండా ముఖ్యమంత్రి పేర్ల మీద తయారుచేసిన హద్దు రాళ్లకోసం ఒక్క మాచవరం మండలంలోనే సుమారు రూ.55 లక్షలు ఖర్చుపెట్టారంటే అతిశయోక్తి కాదు. పేద ప్రజల సొమ్ముతో ఏర్పాటుచేసిన హద్దురాళ్లపై జగనన్న భూరక్ష పేరుమీద పేర్లు ముద్రించడం విడ్డూరంగా వుందని ప్రజలు విమర్శిస్తున్నారు. మాచవరం మండలంలో మొత్తం 9 రెవెన్యూ గ్రామాలుండగా ఇప్పటికే 8 రెవెన్యూ గ్రామాలకు హద్దురాళ్లు వచ్చాయి. వీటిలో ఆకురాజుపల్లి, చెన్నాయపాలెం, శ్రీరుక్మిణీపురం గ్రామాలలో పూర్తిగా హద్దురాళ్లు గుర్తించగా మాచవరం, మల్లవోలు గ్రామాలలో కొంతమేర మాత్రమే హద్దురాళ్లు గుర్తించారు. వేమవరం, పిన్నెల్లి గ్రామాల్లో హద్దు రాళ్లు గుర్తించే కార్యక్రమం ఇప్పటివరకు ప్రారంభమే కాలేదు. పిల్లుట్ల రెవెన్యూ గ్రామానికి ఇంకా హద్దురాళ్లు రావాల్సి వుంది. తెలుగుదేశం ప్రభుత్వం టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయడంతో అప్పట్లో అనవసరంగా లక్షల రూపాయలు వ్యయం చేసి తెచ్చిన రాళ్లు ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో శిథిలావస్థకు చేరుకున్నాయి. మొత్తం మీద భూసర్వే వల్ల రైతులకు ఒరిగిందేమీ లేదంటూ ఆయా గ్రామాల రైతులు వ్యక్తం చేస్తున్నారు.


హద్దురాళ్లపై జగనన్న భూరక్ష పేరుతో ముద్రించి వున్న దృశ్యం

కడలి వేటకు.. వేళాయె

- హార్బర్‌లో చేపలవేటకు పయనమైన గంగపుత్రులు
- ప్రత్యేక పూజలు నిర్వహించిన మత్స్యకారులు
- భృతి అందించాలంటూ వేడుకోలు


నిజాంపట్నం హార్బర్‌లో వేటకు బయలుదేరిన బోటులో మత్స్యకారులు

రేపల్లె, జూన్ 17: తీర ప్రాంతంలో వేట విరామం ముగియటంతో గంగపుత్రులు గ్రామదేవతకు, బోట్లకు, సముద్ర తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి సోమవారం తెల్లవారుజామున 4గంటలకు చేపల వేటకు పయనమయ్యారు. ఈ ఏడాది మత్స్య సంపద అధికంగా దొరికి తమ జీవితాల్లో వెలుగులు నింపాలంటూ బోట్లకు కొబ్బరికాయలు కొట్టి సముద్రంలోకి పయనమయ్యారు. నిజాంపట్నం హార్బర్‌లో 280 బోట్లు, ఇంజన్‌నావలు, మరపడవలు 300లు పైగానే ఉన్నాయి. హార్బర్‌లో వేటపై మూడువేల మంది మత్స్యకారులు జీవనాన్ని కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది వేట విరామ సమయంలో మత్స్యకారులకు అందించాల్సిన భృతి గత ప్రభుత్వం అందించలేదని, ఈ ప్రభుత్వం మత్స్యకారులపై దృష్టిసారించి జీవనభృతిని అందించాలని మత్స్యకారులు కోరుతున్నారు.

నీటిపారుదల సలహా మండలి సమావేశం ఎప్పుడు?

- ఖరీఫ్ సీజన్‌కు ఎప్పటి నుంచి సాగునీటి విడుదలనే దానిపై అస్పష్టత
- ఈ వారంలో మీటింగ్ ఏర్పాటు చేసి చర్చించాలని కోరుతున్న రైతులు

గుంటూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో జిల్లాలో ముఖ్యంగా కృష్ణా పశ్చిమ డెల్టా, గుంటూరు ఛానల్‌కు సాగునీటిని ఎప్పుడు విడుదల చేస్తారనే దానిపై అస్పష్టత నెలకొంది. జిల్లాస్థాయి అధికారులు బదిలీల కోసం ఎదురు చూస్తూ ఈ సమావేశాన్ని విస్మరిస్తున్నారు. దీని వలన రైతులకు ఇబ్బందులు తప్పేలా లేవు. ప్రతీ సంవత్సరం ఈపాటికే జిల్లా నీటిపారుదల సలహా మండలి సమావేశాన్ని ఏర్పాటు చేసి రైతులు ఎప్పటినుంచి కాలువలకు నీటిని విడుదల చేయాలని కోరుకొంటున్నారనే అంశంపై చర్చించి ఒక నిర్ణయానికి వచ్చి దానిని తీర్మానం రూపంలో ప్రభుత్వానికి పంపించేవారు. ఆ తేదీకి ప్రాజెక్టుల్లో నీటి లభ్యత మేరకు కాలువలకు సాగునీటిని జిల్లా నీటిపారుదల శాఖ విడుదల చేసేది. అయితే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం కూలిపోయి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ సమావేశం ఏర్పాటు విషయంలో ఏ విధంగా ముందుకెళ్లాలనే దానిపై అధికారులు తటపటాయిస్తున్నారు.

ఏటా ఖరీఫ్‌కి ముందు, తర్వాత రెండుసార్లు జిల్లా నీటిపారుదల సలహా మండలి సమావేశాలను ఇరిగేషన్ శాఖ నిర్వహిస్తుంది. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు, నీటిపారుదల, వ్యవసాయం, ఉద్యానవన, ఆర్‌డబ్ల్యూఎస్, మునిసిపల్ తదితర శాఖల అధికారులు హాజరై చర్చిస్తారు. నవంబరు, డిసెంబరు నెలల్లో ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్న దృష్ట్యా ముందుగానే నీటిని విడుదల చేయాలని రైతులు కోరుకొంటారు. అయితే కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు నిర్మించిన ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలతో వరదనీరు సకాలంలో రావడం లేదు. భారీ వరదలు వస్తే తప్పా జూలై మొదటి వారంలో నీరు జలాశయాల్లోకి చేరని పరిస్థితి. గత ఏడాది నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లోనే రాలేదు. దిగువున వరదల ద్వారా వచ్చిన నీటితో ఎలాగోలా ఖరీఫ్ సీజన్ పంటలను కాపాడుకోగలిగారు.

కాగా ఈ సంవత్సరం రుతుపవనాలు సకాలంలోనే వస్తాయని వాతావరణ శాఖ చెబుతున్నప్పటికీ వాటి జాడ ఇంకా కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా గోదావరి వరదనీటిని ప్రకాశం బ్యారేజ్‌కు తీసుకొస్తే డెల్టాకు జూలై మొదటి వారంలోనే నీటిని విడుదల చేసే అవకాశం ఉంటుంది. మరోవైపు తాగునీటి చెరువుల్లో నీరు అడగంటుతున్నది. దీని దృష్ట్యా కనీసం చెరువులు నింపడానికి అయినా ఒక దఫా నీటిని విడుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు. వీటన్నింటిపై చర్చించి తుది నిర్ణయం తీసుకోవడానికి నీటిపారుదల సలహా మండలి సమావేశమే తగిన వేదిక. మంత్రులు, ఎమ్మెల్యేలు ఉన్న దృష్ట్యా సాధ్యమైనంత త్వరగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. దాంతో నీటి విడుదల తేదీపై స్పష్టత వస్తుందని, ఆ మేరకు తాము సాగుకు సంసిద్ధమౌతామని చెబుతున్నారు.

20న విజయవాడలో ఏపీసీసీ సమీక్ష

- నరసరావుపేట, బాపట్ల, గుంటూరు జిల్లాల నేతలతో సమీక్ష

గుంటూరు, జూన్ 17: ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నేతృత్వంలో ఈనెల 20వ తేదీన విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు 20వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 3 గంటల వరకు నరసరావుపేట నేతలతో, బాపట్ల జిల్లా నేతలతో 3 గంటల నుంచి 3.30 గంటల వరకు, 3.30 గంటల నుంచి 4 గంటల వరకు గుంటూరు జిల్లా నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్ రాజా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జిల్లా నేతలకు సమాచారం అందించారు.

ఇద్దరు బాలికలపై వృద్ధుడి లైంగిక దాడి

నకరికల్లు, జూన్ 17: ఇద్దరు మైనర్ బాలికలపై ఓ వృద్ధుడు పాశవికంగా లైంగిక దాడికి పాల్పడిన ఘటన నకరికల్లు మండలంలోని ఓ గ్రామంలో జరిగింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలికలు తినుబండారాలు కొనుగోలు చేసేందుకు వృద్ధుడు నిర్వహించే తినుబండారాల దుకాణానికి వెళ్ళేవారు. ఈ క్రమంలో తినుబండారాలను బాలికలకు అందిస్తూ వారిపై లైంగిక దాడి చేశాడు. అతనికి 65 సంవత్సరాల వయస్సు ఉంటుంది. నెల రోజులుగా ఇద్దరు చిన్నారులపై వృద్ధుడు లైంగిక దాడిని కొనసాగిస్తున్నాడు. ఆ చిన్నారులు పొట్టలో నొప్పి రావటంతో వారి కుటుంబ సభ్యులకు వృద్ధుడు చేసే చర్యల గురించి తెలిపారు. దీంతో ఇరువురి బాలికలు కుటుంబ సభ్యులతో కలసి వచ్చి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సత్తెనపల్లి డీఎస్పీ గురునాథ బాబు పోక్సో చట్టం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాత పద్ధతిలోనే డిగ్రీ అడ్మిషన్లు నిర్వహించాలి

- ఆక్టా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మోహనరావు, శ్రీనివాసరెడ్డి డిమాండ్

గుంటూరు(విద్య), జూన్ 17: ఈ విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ఆన్‌లైనలో కాకుండా పాత పద్ధతిలోనే నిర్వహించాలని, అఫ్లియేటెడ్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్(ఆక్టా) అధ్యక్ష, కార్యదర్శులు కె.మోహనరావు, శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం జేకేసీ కళాశాలలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో సంఘం నాయకులు మాట్లాడుతూ జీవో నెంబర్.77ను రద్దుచేసి తిరిగి పీజీ విద్యార్థులకు ఫీజు రీ యింబర్స్‌మెంట్ పునరుద్ధరించాలని కోరారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఏఎస్ రామకృష్ణ కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కె.సాంబిరెడ్డి, అధ్యక్షులు కె.మోహన్ రావు,కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, అదనపు కార్యదర్శి రాయపాటి శ్రీనివాస్, డాక్టర్ శ్రీనివాస సాయి, ఫైనాన్స్ సెక్రెటరీ డాక్టర్ కే మోజెస్, పబ్లికేషన్ సెక్రెటరీ డాక్టర్ సదాశివరెడ్డి, యం రమేష్, జేకేసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఐ నాగేశ్వరరావు, పీఏఎస్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పాతూరి శ్రీనివాస్, డాక్టర్ కెఆర్‌ఆర్‌ఎం డిగ్రీ కళాశాల దుగ్గిరాల ప్రిన్సిపల్ డాక్టర్ గిరి, బోడెపూడి వెంకటేశ్వర్లు, గవర్నమెంట్ కళాశాల అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ రాజగోపాల్‌బాబు, డాక్టర్ శ్యామ్‌బాబు, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ రాజీవరెడ్డి, డాక్టర్ గంటా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత మాజీ ఎమ్మెల్సీ దివంగత ఎంజే మాణిక్యరావు చిత్రపటానికి పూల మాలలు వేసి ఆక్టా నాయకులు నివాళులర్పించారు.


ఎంజే మాణిక్యరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆక్టా నాయకులు మోహనరావు, శ్రీనివాసరెడ్డి తదితరులు

మంత్రి సంధ్యారాణికి సత్కారం

తాడేపల్లి టౌన్, జూన్ 17: గిరిజన సంక్షేమ, శిశు సంక్షేమ శాఖా మంత్రిగా సోమవారం బాధ్యతలు చేపట్టిన గుమ్మిడి సంధ్యారాణిని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్, ట్రైబల్ ప్రజా సమైక్య జాతీయ అధ్యక్షులు కె.అక్కులప్ప నాయక్ తదితరులు సత్కరించారు. ఈ సందర్భంగా అక్కులప్ప నాయక్ మాట్లాడుతూ ఆదివాసి గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేయాలని, గిరిజన గ్రామాల్లో తాగునీటితోపాటు విద్య వైద్యం మెరుగైన వసతులు కల్పించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. అలాగే ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు గిరిజనుల అభివృద్ధి కోసమే ఖర్చు పెట్టాలని, విద్యార్థులకు సంక్షేమ హాస్టల్‌లో మెరుగైన పౌష్టిక ఆహారం అందించాలని మంత్రిని కోరారు.


మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని సత్కరిస్తున్న టీఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు అక్కులప్ప నాయక్

వైసీపీ కౌన్సిలర్ అరాచకం

- ప్రాణభయంతో ఊరొదిలిన కుటుంబం
- బలవంతంగా ఆస్తుల ఆక్రమణ
- బాధితులను పట్టించుకోని పోలీసులు
- రక్షణ లేక ఊరు వదిలిన బాధితులు
- ప్రభుత్వం మారడంతో మళ్ళీ తెనాలికి
- ఇల్లు ఖాళీ చేసి వెళ్లాలంటూ మళ్ళీ కౌన్సిలర్ అనుచరుల వేధింపులు
- న్యాయం చేయాలంటూ త్రీటౌన్‌లో బాధితుల ఫిర్యాదు

తెనాలి, మారీసుపేట జూన్ 17: గత వైసీపీ ప్రభుత్వంలో అధికారపక్షానికి చెందిన 33వ వార్డు కౌన్సిలర్ మొగల్ రహమత్ బేగ్ అధికారుల అండతో తన వార్డులో నచ్చిన ఇతరుల ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు వారిని భయభ్రాంతులకు గురి చేశారు. మనుషులతో కొట్టించి వారి ఇంటిని తన పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఘటన వెలుగులోకి వచ్చింది.

బాధితులు, పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. బాలాజీరావుపేటకు చెందిన భార్యభర్తలైన జయశ్రీ, జోజిరావులు తన స్వగృహంలో ఆర్ఎంపీగా జీవనం సాగిస్తున్నారు. ఏప్రిల్ నెలలో కొందరు వ్యక్తులు ఒక మహిళను తమవద్దకు తీసుకొచ్చి గ్యాస్, అనారోగ్య సమస్యతో బాధపడుతుందని ఓ ఇంజెక్షన్ ఇవ్వాలని కోరారని బాధితులు తెలిపారు. ఇంజక్షన్ చేసిన వెంటనే ఆ మహిళ కింద పడిపోవడం, ఆమెను నువ్వే ఇంజెక్షన్ చేసి చంపావని వారు గొడవకు దిగారు. చనిపోయే ప్రమాదం లేదని తెలిసి వారి గొడవతో తాను కూడా భయపడి ఒక ప్రైవేట్ హాస్పటల్‌కి తీసుకెళ్లి చికిత్స చేయించామని వివరించారు.

రెండు రోజుల తరువాత 100 మందికి పైగా జనం మా ఇంటికి వచ్చి హడావుడి చేశారని పేర్కొన్నారు. కౌన్సిలర్ మొగల్ రహమత్ బేగ్ వేసిన స్కెచ్ ప్రకారమే మాఇంటిపైకి వచ్చారని తెలిసిందన్నారు. తాము కోరకుండానే మా మధ్య ఒక పెద్దమనిషిగా ప్రవేశించి ఆతరువాత ఇంటిని స్వాధీనం చేసుకునే తతంగమంతా నడిపారని వివరించారు. ఆమె చనిపోకున్నా నీవల్లే ఆమె చనిపోయిందని వారు గొడవ చేస్తున్నారని భయపెట్టారు. సుమారు 13 సవర్ల బంగారం కూడా తీసుకొని మా ఇంటి డాక్యుమెంట్లను తన పేర రాయించుకున్నాడని బాధితురాలు తెలిపింది. ఈ దౌర్జన్యంపై అప్పట్లోనే త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లగా వారు ఫిర్యాదు తీసుకోలేదని, వారిని పిలిపించి మేమే మాట్లాడతామని తిప్పి పంపారని వారు వివరించారు.

ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏర్పడటం, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరికలు చేయడంతో మళ్ళీ తిరిగి వచ్చామని తీరా వచ్చాక కూడా మమ్మల్ని వదలకుండా కొన్ని కాగితాలు తీసుకొచ్చి సంతకాలు చేయాలని బెదిరించారని అన్నారు. సామానులు బయటపడవేసి తాళం వేస్తామంటూ బెదిరించడంతో చేసేదిలేక ఆదివారం మళ్లీ త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. ఈ ఘటనపై త్రీటౌన్ ఎస్ఐ వెంకటేశ్వరరావును వివరణ కోరగా జయశ్రీ, జోజికుమార్‌ల దంపతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వార్డు కౌన్సిలర్ మొగల్ రహమత్ బేగ్, ఫజల్‌బేగ్, జాన్‌సైదాలను అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు పేర్కొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న బాధితులు జయశ్రీ, జోజికుమార్ దంపతులు

లారీ ఢీకొని స్పిన్నింగ్ మిల్లు కార్మికుడు మృతి

నాదెండ్ల, జూన్ 17: మండలంలోని గణపవరం గ్రామ పరిధిలో గల జాతీయ రహదారిపై లారీ ఢీకొన్న సంఘటనలో స్పిన్నింగ్ మిల్లు కార్మికుడు రాగబ్బు జన(54) అనే వ్యక్తి మృతి చెందాడు. నాదెండ్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఒడిస్సా రాష్ట్రానికి చెందిన రాగబ్బు జన ఏడాది కాలంగా కార్మికుడిగా పని చేస్తున్నాడు. స్థానికంగా ఉన్న ఒక స్పిన్నింగ్ మిల్లు క్వార్టర్స్‌లో నివాసం ఉంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. ఆదివారం రాత్రి మందుల కోసం గణపవరం గ్రామంలోకి వెళ్ళి ప్రసన్న వంశీకృష్ణ స్పిన్నింగ్ మిల్లు క్వార్టర్స్‌కు వస్తుండగా చిలకలూరిపేట నుంచి గుంటూరు వెళ్ళే లారీ అతన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ అతని పైగుండా వెళ్ళగా తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుడు సంతోష్ ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.80
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	150, 159,170
చికెన్ విత్ స్కిన్	290.00
చికెన్ స్కిన్ లెస్	300.00

లారీలో మంటలు.. మిర్చి అగ్నికి ఆహుతి

- కోటి రూపాయల నష్టం

రాజుపాలెం, జూన్17: ప్రయాణిస్తున్న లారీ ఇంజన్‌లో నుంచి ఒక్కసారిగా మంటలు రావటంతో లారీతో పాటు, సుమారు 300 మిర్చి బస్తాలు అగ్నికి ఆహుతి అయిన ఘటన గుంటూరు-మాచర్ల రహదారిపై మండల పరిధిలోని అనుపాలెం గ్రామ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. గుంటూరు నుంచి మిర్చి లోడుతో మహరాష్ట్రకు బయల్దేరిన లారీ మార్గమధ్యంలోని రాజుపాలెం మండలం అనుపాలెం గ్రామ సమీపంలోకి వచ్చేసరికి ఇంజన్‌లో నుంచి ఒక్కసారిగా మంటలు వచ్చినట్లు డ్రైవర్ మహేష్ తెలిపారు. దీంతో భయాందోళనకు గురైన మహేష్, క్లీనర్‌లు ఇరువురు లారీలో నుండి ఒక్కసారిగా దూకి వెనక్కు పరుగులు తీశారు. మంటలు లారీ మొత్తం వ్యాపించటంతో మిర్చి మొత్తం అగ్నికి ఆహుతి అయింది. సమాచారం తెలుసుకున్న పిడుగురాళ్ల ఫైర్‌స్టేషన్ సిబ్బంది హుటాహుటిన దగ్ధమవుతున్న లారీ వద్దకు చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ సంఘటనలో మొత్తం కోటి రూపాయల వరకు నష్టం వాటిల్లినట్లు వారు తెలిపారు.


లారీ ఇంజన్‌లో మంటలు చెలరేగటంతో అగ్నికి ఆహుతి అవుతున్న మిర్చి

పల్నాడు వార్తలు

మాచర్ల ◆గురజాల ◆సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



ఎమ్మెల్యే యరపతినేనికి పూలకిరీటం, ద్రాక్ష పండ్ల దండ వేస్తున్న ఆర్యవైశ్య నేతలు

నియోజకవర్గ అభివృద్ధికే పెద్దపీట

● కార్యకర్తలతో గురజాల ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, జూన్ 17: తనపై ఎంతో నమ్మకం ఉంచిన గురజాల ప్రజల అభీష్టం మేరకు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రాధాన్యమిస్తానని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం తొలిసారి పిడుగురాళ్లకు వచ్చిన యరపతినేని స్థానిక ఆర్అండ్‌బి బంగ్లాలో పార్టీ కార్యకర్తలతో మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ అరాచక పాలనకు రాష్ట్ర ప్రజలతో పాటు గురజాల ప్రజలు తెరదించారన్నారు. 2014-2019 మధ్యకాలంలో గురజాల నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధే మినహా గడిచిన ఐదేళ్లలో జరిగిందేమీ లేదన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలని, వైసీపీ నేతలు చేసిన విధంగా ఏ ఒక్కరు చేయొద్దన్నారు. పార్టీకి, తనకు కష్టకాలంలో అండగా వున్న ప్రతి కార్యకర్తకు తాను అండగా ఉంటానన్నారు. జరగబోయే అసెంబ్లీ సమావేశాలలో ప్రమాణ స్వీకారం అనంతరం గురజాల అభివృద్ధిపైనే చర్చిస్తానన్నారు. పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న వారికి పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు, గ్రామ, పట్టణ స్థాయిలో రాజ్యాంగ పదవుల కేటాయింపులోను ప్రాధాన్యమిస్తానన్నారు. పిడుగురాళ్ల, మాచవరం మండలాల నుండి పలువురు పార్టీ నాయకులు యరపతినేని శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమాలలో పాండురంగ శ్రీను, షేక్ బాబావలి, కనిగిరి శ్రీను, కొమ్మినేని రామచంద్రరావు, దియ్యా శ్రీను, చింతలపూడి రామ్మూర్తి, వనజా సాంబశివరావు, ఆలేటి మల్లిఖార్జునరావు, కోట హరి, చేగు రమేష్, మందా డేవిడ్, పణితి రవి, పిల్లి చెన్నారావు, వున్నం సురేష్, కొక్కెర కొండలు, నంద్యాల వెంకటేశ్వరరెడ్డి, నక్కెంటి శ్రీను, ముప్పాళ్ల సాంబయ్య, సాదం హనుమయ్య, ముప్పాళ్ల రమేష్, యడ్లపల్లి శివ, జూలకంటి సుబ్రహ్మణ్యం, అంబటి హనుమంతరావు, చల్లగుండ్ల శ్రీను, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు యరపతినేని గురజాలకు రాక

గురజాలటౌన్, జూన్ 17: గురజాల శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు మంగళవారం గురజాల పట్టణానికి రానున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. కూటమి అసెంబ్లీ అభ్యర్థిగా గురజాల నుంచి భారీ మెజార్టీతో గెలుపొందిన తరువాత మొట్టమొదటి సారిగా పట్టణానికి వస్తున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం 3 గంటలకు పట్టణంలోని పాతపాటేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొంటారన్నారు. అక్కడి నుంచి గాంధీబొమ్మ సెంటర్, లక్ష్మీటాకీస్ సెంటర్ మీదుగా బ్రహ్మనాయుడు విగ్రహం వరకు విజయోత్సవ ర్యాలీ ఉంటుందన్నారు. అనంతరం 3:30 గంటలకు పట్టణంలోని పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్‌లో మండల, పట్టణ పరిధిలోని కూటమి నేతలు, కార్యకర్తలతో గ్రామాల వారీగా సమీక్షా సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.



ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న గ్రామ రెవెన్యూ అధికారులు

ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డిని కలిసిన వీఆర్వో సంఘ నేతలు

మాచర్లటౌన్, జూన్ 17: మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మారెడ్డిని సోమవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని టీడీపీ క్యాంపు కార్యాలయంలో సోమవారం పల్నాడు గ్రామ రెవెన్యూ అధికారుల అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డికి పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆరుమళ్ల నాగేశ్వరరావు, సహాధ్యక్షుడు షేక్ ఖాజావలి, గురజాల డివిజన్ అధ్యక్షుడు కడియం రాజు, సంఘ సభ్యులు కొండలు, అనిల్‌కుమార్, నందనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ అరుణపై ఎమ్మెల్యే జూలకంటి ఆగ్రహం

మాచర్లటౌన్, జూన్ 17: పట్టణ ఎస్ఐ అరుణపై మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని పదో వార్డు శెరీన్‌కాలనీకి చెందిన కర్పూరపు శ్రావన్‌కుమార్ అనే వ్యక్తిపై వైసీపీ మూకలు శనివారం దాడి చేసి గాయపరిచారు. ఈ దాడిలో శ్రావణ్‌కుమార్ తలకు గాయాలయ్యాయి. ఈ దాడిపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా ఎస్ఐ అరుణ ఫిర్యాదు స్వీకరించలేదని బాధితుడు శ్రావణ్‌కుమార్ వాపోయారు. పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శాంతికళ్యాణంలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డికి తనపై జరిగిన దాడి, స్టేషన్‌లో ఫిర్యాదు తీసుకోకపోవడంపై వివరించారు. దీంతో ఎమ్మెల్యే జేబీఆర్ పక్కనేవున్న ఎస్ఐ అరుణపై ఆగ్రహం వ్యక్తంచేశారు. వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ కార్యకర్తలపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సందర్భాల్లో పోలీస్‌స్టేషన్‌లలో టీడీపీ బాధితుల ఫిర్యాదు తీసుకోకపోగా వారినే కేసులు పెట్టారని, ఇప్పుడు ప్రభుత్వం మారినప్పటికీ తీరు మార్చుకోరా అంటూ ఎస్ఐ అరుణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పక్కను ఉన్న పట్టణ సీఐ బ్రహ్మయ్య కలుగజేసుకొని బాధితుడి నుంచి వెంటనే ఫిర్యాదు స్వీకరించి చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి శాంతించారు.

వాసవీ దేవాలయానికి పాదయాత్ర

కారంపూడి, జూన్ 17: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం నుంచి పెనుగొండ వాసవీ అమ్మవారి ఆలయానికి ఆర్యవైశ్య నేత కర్నాటి గోపాలకృష్ణమూర్తి పాదయాత్ర సోమవారం ప్రారంభమైంది. ఆయనతోపాటు తెలుగుయువత నేత కొండ శ్రీనివాస్ పాదయాత్ర చేయనున్నారు. ఆలయం వద్ద సంఘ నేతలు కాసుల చలమయ్య, ఎస్‌పీఆర్ కృష్ణ, కాసుల గోవిందులు కొబ్బరికాయలు కొట్టి మొక్కుబడులు తీర్చుకున్నారు. టీడీపీ నేతలు కటికల బాలకృష్ణ, చప్పిడి రాము, తండా మస్తాన్‌జాని, తెలుగు మహిళా నాయకురాలు నాగలక్ష్మిరెడ్డి, జానీబాషా, నన్నేసా, నాగవరపు రాముడు, భవిరిశెట్టి పూర్ణచంద్రరావు తదితరులు కారంపూడి గ్రామ పొలిమేర వరకు పాదయాత్రలో పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సినేషన్‌పై అవగాహన

మాచర్లరూరల్, జూన్ 17: మండలంలోని విజయపురిసౌత్ హెల్త్ సెంటర్లో సోమవారం జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి బీసీజీ వ్యాక్సినేషన్‌పై సిబ్బందికి అవగాహన కల్పించారు. 50 సంవత్సరాలు నిండిన వారికి ఈ వ్యాక్సిన్ అందించాలన్నారు. ఈనెల 19న ప్రపంచ సికెల్ సెల్ ఎనిమియా దినోత్సవంలో భాగంగా మండలంలోని ఏడోమైల్ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించనున్న వైద్య పరీక్షలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ అరుణకుమార్, డాక్టర్ వెస్లీ, ప్రవీణ్, సాయికృష్ణ, సూపర్‌వైజర్ బీవీ సుబ్బాచారి, హర్ష, పద్మావతి పాల్గొన్నారు.

పల్లా నియామకంపై హర్షం

అమరావతి, జూన్ 17: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుయాదవ్‌ను నియమించడంపై పెదకూరపాడు నియోజకవర్గ శాసన సభ్యులు భాష్యం ప్రవీణ్ హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్యే శ్రీనివాసరావు యాదవ్ ఆధ్వర్యంలో తెలుగుదేశంపార్టీ మరింత బలోపేతంకావాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్‌ను కారంపూడికి చెందిన బీజేపీ నేతలు శెట్టి హనుమంతురావు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పువ్వాడ శ్రీనివాస్, కోశాధికారి కజ్జం సైదులు, ఏలూరి శశికుమార్ తదితరులు సోమవారం కలుసుకొని దుశ్శాలువలతో సన్మానించి అభినందనలు తెలిపారు. - కారంపూడి



ఎమ్మెల్యే యరపతినేనికి జన నీరాజనాలు

● పిడుగురాళ్లలో భారీ విజయోత్సవ ర్యాలీ
● గజమాలలతో ఘనస్వాగతం
● ఆలయాల్లో పూజలు, చర్చి, మసీదులో ప్రార్థనలు



ఎమ్మెల్యే యరపతినేనికి గజమాలతో ఘన స్వాగతం

పిడుగురాళ్ల, జూన్ 17: గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యేగా నాల్గవసారి ఎన్నికైన యరపతినేని శ్రీనివాసరావు సోమవారం తొలిసారిగా పిడుగురాళ్లకు విచ్చేయగా పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. కొండమోడు నుండి అడుగడుగున పార్టీ శ్రేణులు భారీ గజమాలలతో స్వాగతం పలికారు. తెలుగు మహిళలు హారతు లిచ్చారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఆయన తొలిసారిగా పిడుగురాళ్ల వచ్చిన సందర్భంగా పార్టీ శ్రేణులు, ప్రజల నుంచి ఘన స్వాగతం లభించింది. పార్టీ కార్యాలయంలో పోలీసు అధికారులతో కొద్దిసేపు మాట్లాడిన అనంతరం విజయోత్సవ ర్యాలీ ప్రారంభమైంది. ర్యాలీ దారిలో గంగమ్మతల్లి దేవాలయం, చర్చి, కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో పూజలు, చర్చి,మసీదులో ప్రార్థనలు నిర్వహించారు. ర్యాలీలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుతో పాటు మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణ మూర్తి, పార్టీ నాయకులు వున్నారు. పిడుగు రాళ్ల, మాచవరం మండలాల నుంచి కూటమి పార్టీల నుంచి నేతలు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చారు.



పిడుగురాళ్ల మసీదులో నమాజ్ చేస్తున్న యరపతినేని జంగా, ముస్లింలు

2 కిలోమీటర్లు.. 3 గంటలు..

పిడుగురాళ్ల పట్టణానికి ఎమ్మెల్యేగా 4వ సారి ఎన్నికైన తరువాత సోమవారం వచ్చిన యరపతినేని శ్రీనివాసరావుకు ఉమ్మడి కూటమి సభ్యులు అఖండ స్వాగతం పలికారు. పార్టీ కార్యాలయం నుండి కన్యకాపరమేశ్వరి అమ్మవారి గుడి వరకు 2 కిలోమీటర్ల దూర ప్రయాణం సుమారు 3 గంటలకు పైగా సమయం పట్టింది. యరపతినేనికి స్వాగతం పలికేందుకు వేలాదిగా తరలివచ్చిన పార్టీ నాయకులతో పిడుగురాళ్ల పట్టణం పసుపుమయమై కిక్కిరిసిపోయింది. ఐదేళ్ల తర్వాత పార్టీ నేతలు రెట్టింపు ఉత్సాహంతో విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వున్నం నాగమల్లిఖార్జునరావు, యరపతినేని నిఖిల్, పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, దియ్యా రామకృష్ణ, కనిగిరి శ్రీను, కటకం అంకారావు, కామిశెట్టి రమేష్, దూదేకుల ఖాశింసైదా, తురకా వీరస్వామి, గండికోట వెంకటేశ్వర్లు, మేకల రాంబాబు, బడిగుంచల వెంకటేశ్వర్లు, సయ్యద్ అమీర్అలి, ఎల్‌విఆర్, జొన్నలగడ్డ శ్రీను, వడ్డవల్లి సాంబశివరావు, కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



విజయోత్సవ ర్యాలీకి హాజరైన పార్టీ నాయకులు

మహ్మద్ ప్రవక్త మార్గం అనుసరణీయం

● బక్రీదు ప్రార్థనల్లో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి
● మసీదు స్థల సమస్యలు పరిష్కరిస్తా

మాచర్లటౌన్, జూన్ 17: మహ్మద్ ప్రవక్త చూపిన మార్గం అనుసరణీయమని, ముస్లిం సమాజం మొత్తం ఆ మార్గంలో నడవాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. సోమవారం బక్రీద్ సందర్భంగా పట్టణంలోని ఈద్గాలో ముస్లింలు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముస్లిం సమాజానికి సేవచేసి వారి రుణం తీర్చుకుంటానన్నారు. మండలంలోని జమ్మలమడక, పట్టణంలోని మసీదు స్థల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం ముస్లింకు బక్రీదు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

రెంటచింతల : బక్రీద్ పర్వదినం నేపథ్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లోని మసీదుల్లో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. మక్కా, మదీనా క్షేత్రాలను జీవితంలో ఒక్కసారైనా దర్శించుకోవాలనేది ముస్లిం ఆకాంక్ష అని మతపెద్దలు ఉద్బోధించారు. కార్యక్రమంలో షఫీ, ఇలియాస్, సాద్, ముఫ్తి ఖాసిమ్ పాల్గొన్నారు.

కారంపూడి : మండల కేంద్రమైన కారంపూడిలో బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. బక్రీద్ విశిష్టతను మత పెద్దలు వివరించారు. త్యాగానికీ ప్రతీక బక్రీద్ అన్నారు. ప్రతి ఒక్కరూ సోదర బావంతో జీవించాలన్నారు. ప్రార్థనల్లో టీడీపీ నేతలు షేక్ మస్తాన్, జానీబాషా, నన్నేసా తదితరులు పాల్గొన్నారు.

మాచవరం: మండల కేంద్రమైన మాచవరం, తురకపాలెం, పిన్నెల్లి, గంగిరెడ్డిపాలెం, వేమవరం, మోర్జంపాడు, రేగులగడ్డ, తదితర గ్రామాల్లో ముస్లింలు ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

సత్తెనపల్లి : మాచర్ల రోడ్డులోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు ధార్మిక సందేశాలు అందించారు ఈ సందర్భంగా ముస్లింలు తమ వంతుగా పేదలకు దాన ధర్మాలు చేశారు. ముస్లిం సోదరులు ఒకరినొకరిని ఆలింగనం చేసుకొని బక్రీదు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి


అమరావతి : మండల కేంద్రం అమరావతితో పాటు ఎండ్రాయి, లేమల్లె, వైకుంఠపురం, నెమలికల్లు, లింగాపురం, మునగోడు, ధరణికోట తదితర గ్రామాలలో ముస్లింలు ఈద్గాలు, మసీద్‌లలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అమరావతిలో నిర్వహించిన ప్రార్థనల్లో స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. అనంతరం ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు.

బెల్లంకొండ: బక్రీద్ పండుగ సందర్భంగా మండల కేంద్రమైన బెల్లంకొండలో ముస్లింలు ఈద్గాల వద్ద నమాజ్ చేశారు. అలాగే వన్నాయపాలెం, నందిరాజుపాలెం, పాపాయపాలెం, న్యూ చిట్యాల ఆర్అండ్ఆర్ సెంటర్లలోనూ బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

క్రోసూరు: మండల కేంద్రం క్రోసూరుతో సహా వివిధ గ్రామాల్లో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. క్రోసూరులోని పోలీసు స్టేషన్ పక్కనగల ఈద్గా మైదానంలో వందలాది మంది ముస్లింలు ప్రార్థనలుచేశారు. మండలంలోని దొడ్లేరు, హసానాబాద్, నాగవరం, గుడిపాడు, ఊటుకూరు గ్రామాల్లోనూ బక్రీదు పండుగను ముస్లింలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

పెదకూరపాడు: పెదకూరపాడు మండలంలోని పలు గ్రామాల్లో ముస్లింలు భక్తి శ్రద్ధలతో బక్రీదు పండుగను జరుపుకున్నారు. పెదకూరపాడులో ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని బక్రీదు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పెదకూరపాడుతో పాటు లగడపాడు, చిన్న మక్కెన, పొడపాడు, పాటిబండ్ల, తమ్మవరం, గారపాడు, 75 తాళ్ళూరు, కన్నెగండ్ల తదితర గ్రామాల్లో బక్రీదు పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు.

గురజాలటౌన్: పట్టణంలోని లక్ష్మీటాకీస్ సెంటర్ వద్ద ఈద్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. త్యాగానికి ప్రతీకగా ఈద్గాను జరుపుకుంటామని మత గురువు మహ్మద్ యూనస్ అన్నారు. మహమ్మద్ ప్రవక్త సందేశాలను వివరించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



అమరావతిలో ముస్లిం మత పెద్దలతో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

20న ఆలయ భూములకు వేలం

నకరికల్లు, జూన్ 17 : నకరికల్లులోని లక్ష్మీనరసింహ స్వామి దేవాలయానికి చెందిన భూమిని ఈనెల 20న కౌలుకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈవో వై.వెంకయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 125వ సర్వే నెంబరులోని 6.90 ఎకరాలకు 111/1 సర్వే నెంబరులోని 109 ఎకరాలకు నరసరావుపేటలోని అంకమ్మతల్లి అమ్మవారి దేవస్థాన ఆవరణలో వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల రైతులు ఈ వేలం పాటలో పాల్గొన వచ్చునని ఈవో వెంకయ్య సూచించారు.

అన్న క్యాంటీన్ పనులు ప్రారంభం

సత్తెనపల్లి, జూన్ 17 : నియోజకవర్గ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదేశాలతో పట్టణంలోని తాలూకా సెంటర్‌లో ఏర్పాటుచేసిన అన్నక్యాంటీన్ మరమ్మతు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మునిసిపల్ కమిషనర్ షమ్మి ఆధ్వర్యంలో మునిసిపల్ అధికారులు, ఇతర సిబ్బంది పనులను పర్యవేక్షిస్తున్నారు. అన్న క్యాంటీన్ ప్రారంభమైతే సామాన్యులకు ఎంతో ఉపయోగ పడుతుందని, వివిధ పనుల నిమిత్తం సత్తెనపల్లికి వచ్చే పేద ప్రజలకు రూ.5 లకే టిఫిన్, భోజనం అందుతాయని పలువురు చర్చించుకుంటున్నారు. ఈ విషయంపై టీడీపీ నేతలు మాట్లాడుతూ పేదల ఆకలితీర్చాలనే లక్ష్యంతో అన్నక్యాంటీన్లను ప్రభుత్వం పునఃప్రారంభిస్తుందని, గతంలో రోజుకు 500 మందికి భోజనాలు అందజేశామన్నారు.

వైభవంగా తొలి ఏకాదశి

నకరికల్లు, జూన్ 17: తొలి ఏకాదశి పర్వదినాన్ని సోమవారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చేజర్ల కపోతేశ్వరాలయంలో గంగా భ్రమరాంబ పార్వతి సమేత కపోతేశ్వర స్వామిని భక్తులు దర్శించుకొని అభిషేకాలు చేశారు. కుంకలగుంటలోని శ్రీ భద్రకాళి సమేత ఉత్కంఠ వీరభద్రస్వామి దేవాలయంలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చక స్వాములు కొండకావూరి వెంకట్రామయ్య శర్మ, ప్రవీణ్ కుమార్‌లు నిర్వహించారు. చేజర్లలో ఆలయ ఈవో వై వెంకయ్య, కొండలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో బక్రీదు

అచ్చంపేట, జూన్ 17 : మండల కేంద్రమైన అచ్చంపేటలో సోమవారం ముస్లింలు బక్రీదు పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బక్రీదు పర్వదినం సందర్భంగా ఉదయం నిర్వహించిన ప్రార్థనల్లో వందలాది మంది ముస్లింలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆలింగనంచేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. త్యాగ నిరతికి, దాన గుణానికి ప్రతీక బక్రీదు అని, మహమ్మద్ ప్రవక్త బోధనలు, సూక్తులు అచరణీయమైనవని ముస్లిం మత పెద్దలు తెలిఆరు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన అనేక మంది ముస్లింలు అచ్చంపేటలో ఈద్గా వద్ద నిర్వహించిన బక్రీదు ప్రార్థనల్లో పాల్గొన్నారు.

ఘనంగా దేవాలయ వార్షికోత్సవం

క్రోసూరు, జూన్ 17 : మండలంలోని దొడ్లేరులో గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవ మహోత్సవం సోమవారం కన్నుల పండువగా నిర్వహించారు. ఈసందర్భంగా తెల్లవారు జాము నుంచే స్వామి వారికి సుప్రభాత సేవలు నిర్వహించారు. నారాయణ మూల మంత్ర హోమం, వెంకటేశ్వర అష్టాక్షరి హోమం, రుత్వికుల మంత్రోచ్ఛరణల మధ్య భక్తిశ్రద్ధలతో జరిగింది. అనంతరం స్వామి వారికి, అమ్మవార్లకు కళ్యాణ మహోత్సవాన్ని వేదపండితులు నిర్వహించారు. మంగళ వాయిద్యాలు నడుమ భక్తి శ్రద్ధలతో జరిగిన కళ్యాణాన్ని వందలాది మంది భక్తులు సందర్శించారు. వార్షికోత్సవం సందర్భంగా వేలాది మందికి అన్నదానం నిర్వహించారు. ఉత్సవాల అనంతరం మేళ తాళాలతో, బాణ సంచా కాల్పులతో స్వామి వారి, అమ్మవార్ల గ్రామోత్సవం కోలాహలంగా జరిగింది. కోలాటాలు,



వెంకటేశ్వర కళ్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

స్వామి వారి భక్తి గీతాలాపనతో వీధుల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకుంది. వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకుంది.



పాదయాత్రగా వెళ్తున్న వారితో సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

కూటమి విజయంతో తిరుమలకు పాదయాత్ర

● సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

నకరికల్లు, జూన్ 17 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఘన విజయం సాధించటం, సత్తెనపల్లి శాసన సభ్యునిగా కన్నా లక్ష్మీనారాయణ అత్యధిక మెజార్టీతో గెలుపొందటంతో నకరికల్లుకు చెందిన శ్రీ కృష్ణ దేవరాయ యూత్ తిరుమల తిరుపతి దేవస్థానానికి కాలి నడకన యాత్రగా బయలుదేరారు. వీరికి సింగరాయకొండ వద్ద నియోజకవర్గ టీడీపీ యువ నేత డాక్టర్ సింగరాజుసాయి కృష్ణ కలసి వారితో మాట్లాడుతూ యాత్రకు సంఘీభావం తెలిపి పాదయాత్రలో తీసుకోవాల్సిన వైద్య సూచనలు తెలియజేశారు. కావలి వద్ద ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ వారిని పలుకరించి వారు చాటుతున్న అభిమానానికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో పాడిపంటలు బాగుండాలని, ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని చేపట్టిన ఈ యాత్ర మంచి వాతావరణాన్ని కలుగ చేస్తుందని కన్నా అన్నారు.



తాడికొండ నియోజకవర్గంలోని మోతడక గ్రామంలో గల ఆంజనేయ స్వామి, సాయి బాబా, శివాలయ దేవాలయాల్లో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సోమవారం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. సాయి బాబా దేవాలయంలో అర్చకులు ఎమ్మెల్యే ప్రవీణ్‌ను స్వామి వారి వస్త్రంతో సత్కరించి ఆశీర్వచనాలు అందించారు. - పెదకూరపాడు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

● రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్

బెల్లంకొండ, జూన్ 17 : చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ తెలిపారు. మండల కేంద్రమైన బెల్లంకొండ టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆయన కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పుడైనా ముస్లిం పెద్దలను పిలిచి శుభాకాంక్షలు చెప్పిన పాపాన పోలేదని విమర్శించారు. ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన నారా చంద్రబాబునాయుడు బక్రీదు సందర్భంగా ముస్లిం పెద్దలకు శుభాకాంక్షలు తెలిపిన విషయం గర్వించదగ్గ విషయమన్నారు. ఇచ్చిన హామీల్లో భాగంగా ప్రమాణ స్వీకారం చేసిన రెండవ రోజే ఐదు హామీలపై సంతకాలు చేసిన ఘనత చంద్రబాబుదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదు సంవత్సరాల పాలనలో రాజధాని, పోలవరం విషయంపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. పోలవరం,రాజధాని నిర్మాణాలను పూర్తిచేసే బాధ్యత చంద్రబాబు నాయుడు తీసుకుంటారని, త్వరలోనే అవి పూర్తవుతాయని అన్నారు. సమావేశంలో మండల కోర్ కమిటీ సభ్యులు వెన్నా సీతారామిరెడ్డి, బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, మండల బీసీ సంఘం అధ్యక్షుడు గుంజా గంగారావు, బెల్లంకొండ మాజీ సర్పంచ్ సయ్యద్ జానీ, వైస్ సర్పంచ్ సుభానీ, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఇబ్రహీం, గుడిసె కొండయ్య, తెలుగు యువత అధ్యక్షుడు సలాం, పీఎస్‌కే రసూల్, పిచ్చయ్య, రాంబాబు పాల్గొన్నారు.



కోటప్పకొండ బయలు దేరిన తెలుగు మహిళలతో టీడీపీ నేతలు

మొక్కు చెల్లించుకున్న తెలుగు మహిళలు

సత్తెనపల్లి రూరల్, జూన్ 17 : సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం కూటమి ఘన విజయం సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, సత్తెనపల్లిలో కన్నా లక్ష్మీనారాయణ అత్యధిక మెజార్టీతో గెలవాలని మండలంలోని కొమెరపూడికి చెందిన తెలుగు మహిళలు మొక్కుకున్నారు. మొక్కు చెల్లింపుల్లో భాగంగా సోమవారం గ్రామం నుంచి కాలినడకన కోటప్పకొండకు వెళ్ళి త్రికోటేశ్వర స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. వీరి యాత్రను గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రారంభించారు.

అమరావతి: కూటమి అధికారంలోకి రావడంతో తాడికొండ మండలం మోతడక గ్రామానికి చెందిన 120 మంది మహిళలు సోమవారం అమరావతిలోని అమరేశ్వరాలయంలో మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం 6గంటలకు గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నుండి పాదయాత్రగా బయలుదేరి పది గంటలకు అమరావతి చేరుకున్నారు. అమరేశ్వరాలయం సందర్శించి బాల చాముండికా సమేత అమరేశ్వరస్వామికి పూజలు నిర్వహించారు. రాష్ట్ర రాజధానిగా అమరావతి ఎలాంటి ఆటంకాలు కలుగకుండా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆరోగ్యంగా ఉండాలని స్వామివారిని కోరుకున్నట్లు మహిళలు తెలిపారు. కొన్ని రోజుల క్రితం గోరంట్ల వెంకటేశ్వరస్వామి, అనంతవరం వెంకటేశ్వరస్వామి ఆలయాలలో కూడా పాదయాత్రగా వెళ్లి మొక్కులు తీర్చుకున్నట్లు తెలిపారు.



నిరుపయోగంగా మారిన వాటర్ ఫౌంటెయిన్

నిరుపయోగంగా వాటర్ ఫౌంటెయిన్లు

● ఆక్రమణల మాటున కనుమరుగవుతున్న ఆహ్లాదం

అమరావతి, జూన్ 17: ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా పంచారామ క్షేత్రాల్లో ప్రధమ ఆరామంగా పేరుగాంచిన బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో ప్రసాద్ పథకం ద్వారా జరిగిన అభివృద్ధి పనులలో లక్షలాది రూపాయలు ఖర్చుచేసి ప్రధాన గాలిగోపురం ముందు ఇరువైపుల వాటర్ ఫౌంటేయిన్‌లు ఏర్పాటు చేశారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జరిగిన రెండు ఫౌంటెయిన్లు ఉపయోగకరంగామారి భక్తులకు ఆహ్లాదాన్ని కలుగజేస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఫౌంటేన్‌లను నిరుపయోగంగా మార్చడమే కాకుండా ఆ ఫౌంటెయిన్లు కనిపించకుండా ముందు వైపు ఆక్రమణలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్వామివారి దర్శనానికి వస్తే గాలిగోపురం ముందున్న ఫ్లెక్సీలలో నేతల ఫొటోలు దర్శనమిస్తున్నాయని, ఆలయ ప్రాంగణంలో ఆహ్లాదం, ఆధ్యాత్మికత కనుమరుగైందని భక్తులు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికి అదే పరిస్థితి నెలకొని ఉంది. అధికారులు స్పందించి గాలిగోపురం ముందు వైపు ఉన్న ఆక్రమణలను, అడ్డంకులను తొలగించి లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన ఫౌంటెయిన్లను ఉపయోగంలోకి తీసుకు రావాలని పలువురు కోరుతున్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ప్రభుత్వ ఫర్నిచర్‌ను జగన్ అప్పజెప్పాలి

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



నరసరావుపేట టౌన్, జూన్ 17: ప్రభుత్వ సొమ్ముతో కొన్న ఫర్నిచర్‌ను మాజీ సీఎం జగన్మోహన రెడ్డి ప్రభుత్వానికి అప్పజెప్పాలని లేకుంటే టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అధికారంలో ఉండి జగన్‌మోహన్‌రెడ్డి ఇంట్లోని ఫర్నిచర్, విలువైన వస్తువులను ప్రభుత్వ సొమ్ముతో రూ.15.65 కోట్లు వ్యయంచేసి సమకూర్చుకోవటం తగదన్నారు. వీటిని ప్రభుత్వానికి లెక్కచెప్పి అప్పగించాలన్నారు. లక్షల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టినా ఇంకా జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల సొమ్ము మీద మోజు తీరలేదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు తాడేపల్లి క్యాంప్ కార్యాలయాన్ని ప్రభుత్వ సొమ్ముతో ఫర్నిచర్‌తో నింపేశాడన్నారు. చంద్రబాబునాయుడు ప్రతిపక్షంలో ప్రజావేదికను ప్రభుత్వం స్థలంలో కట్టించి అందులోని ప్రజాదర్బార్‌ను ప్రతిరోజు నిర్వహించేవారన్నారు. ప్రజాదర్బార్‌ను ప్రతిపక్ష నాయకుడిగా తనకు ఇవ్వమని ప్రభుత్వాన్ని అడిగితే, చంద్రబాబు విజ్ఞప్తి పట్టించుకోకపోగా దానిని కూల్చివేసి తన వికృతబుద్ధిని బయట పెట్టుకున్నారని విమర్శించారు. ఒక కుర్చీ, సోఫా తన క్యాంప్ కార్యాలయంలో ఉందని మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు లేఖ రాసినా మూడు నెలల తర్వాత కేసు పెట్టిన వైసీపీ ప్రభుత్వం ఆయనను దొంగగా ముద్రవేసి ఆత్మహత్య చేసుకునేలా చేశారని ఆరోపించారు. కోడెల మాదిరి జగన్‌మోహన్‌రెడ్డికి ఆత్మగౌరవం ఉందనుకోవట్లేదని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఏ అఘాయిత్యం చేసుకోనవసరం లేదని, ఫర్నిచర్ ఇతర విలువైన వస్తువులను ప్రభుత్వానికి అప్పగిస్తే చాలని అన్నారు.

వైభవంగా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం

రొంపిచర్ల, జూన్ 17: మండలంలోని గోగులపాడులోని గంగా పార్వతి సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయ మూడో వార్షికోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకం పూజలను అర్చకులు నారాయణం వెంకట రుక్మిణీ కృష్ణమాచార్యులు నిర్వహించారు. పార్వతిదేవి అమ్మవారికి కుంకుమ పూజలను నిర్వహించారు. ఆలయ ఆవరణలోని దేవతా మూర్తులకు పూజలు జరిగాయి. అభిషేకాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. శివ పార్వతుల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకొని అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో చంద్రమౌళీశ్వర స్వామి



పరగటిచర్లలో ఎమ్మెల్యేను సత్కరిస్తున్న మాజీ జడ్పీటీసీ చిగురుపాటి ఆదినారాయణ

విజయోత్సవాల్లో పాల్గొన్న అరవిందబాబు

రొంపిచర్ల, జూన్ 17: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి జరిగిన తెలుగుదేశం పార్టీ విజయోత్సవ సంబరాల్లో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొన్నారు. పరగటిచర్ల, రామిరెడ్డిపాలెం, వడ్లమూడివారిపాలెం గ్రామాల్లో ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకుల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కూటమి తోనే సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నల్లపాటి రాము, పులుకూరి జగ్గయ్య, పల్లెల నాగిరెడ్డి, గాడిపర్తి సురేష్, కపలవాయి విజయ కుమార్, శాఖమూరి రామ్మూర్తి, మాజీ జెడ్పీటీసీ గుగురుపాటి ఆదినారాయణ, కుమ్మెత కోటిరెడ్డి, అట్ల చిన వెంకటరెడ్డి, ఆయా గ్రామాల తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

రొంపిచర్ల, జూన్ 17: మండలంలోని గోగులపాడులోని చంద్రమౌళీశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన పూజల్లో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నల్లపాటి రాము, పులుకూరి జగ్గయ్య, పల్లెల నాగిరెడ్డి, గాడిపర్తి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



పూర్ణ కుంభంతో ఎమ్మెల్యేకి స్వాగతం పలుకుతున్న ఆలయ కమిటీ నిర్వాహకులు

ఘనంగా కోదండ రామస్వామి కల్యాణోత్సవం

వినుకొండ, జూన్ 17: పట్టణంలోని పాత శివాలయం ఆవరణలోని కోదండ రామస్వామి ఆలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణ మహోత్స కార్యక్రమం వేదపండితుల మంత్రోచ్చరణతో అంగరంగ వైభవంగా సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులును వేదపండితులు పూర్ణకుభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వేద పండితులు శశాంక్, జయచంద్, మోహనకృష్ణ, ఆలయ అర్చకులు రామమోహన్ ఆచార్యులు, ఈవో కొల్లి హనుమంతరావు, శివలింగప్రసాద్, చైర్మన్ కొల్లిపర సుబ్రమణ్యం, కమిటీ సభ్యులు భాగవతుల రవికుమార్, గజవల్లి నాగ పవన్ కుమార్‌లు పాల్గొని ఎమ్మెల్యేను సన్మానించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందచేశారు.

కార్మిక సంక్షేమ బోర్డును ప్రారంభించాలి: బూదాల

వినుకొండ టౌన్, జూన్ 17: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వెంటనే కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జగన్ మోహన్ రెడ్డి నవరత్నాల పేరుతో కార్మిక సంక్షేమ బోర్డు చెందిన రూ.1600 కోట్లు నిధులను వాడుకున్నారని, ఐదేళ్ళ పాటు కార్మికులకు అందాల్సిన అలవెన్సులు అందక, కార్మికులు తీవ్ర ఇబ్బందుల ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికైన నూతన ప్రభుత్వం సంక్షేమ బోర్డును ఏర్పాటుచేసి, పథకాలను అమలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, వందనం, మస్తాన్, మల్లికార్జున రావు, బాబు, సామ్యేల్, సుభాని, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● ఎంఈవో సాంబశివరావు

శావల్యాపురం, జూన్ 17: ప్రభుత్వ పాఠశాలలలోని విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకొని పరీక్షలలో మంచిఫలితాలు సాధించాలని ఎంఈవో మద్దిగుంట్ల సాంబశివరావు అన్నారు. స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ 2024-25 విద్యాసంవత్సరానికి గాను మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలలో 2398మంది విద్యార్థులుండగా వారికి సంవత్సరానికి సరిపడా పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, వర్క్‌బుక్స్, బ్యాగులు, బూట్లు, సాక్సులు, యూనిఫాం, విద్యాసామగ్రితో కూడిన స్టూడెంట్స్ కిట్స్‌ను ప్రభుత్వం పాఠశాలలకు చేరవేసిందన్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలను అందజేయడం కూడా పూర్తయిందన్నారు. త్వరలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు చేతులమీదుగా విద్యార్థులకు మిగిలిన సామగ్రిని కూడా అందజేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. బడిబయటి పిల్లల్ని పాఠశాలలలో చేర్పేందుకు ప్రభుత్వం నేను బడికి పోతా కార్యక్రమాన్ని రూపొందించిందని, పాఠశాల మానిన పిల్లల్ని తిరిగి పాఠశాలల్లో చేర్పేలా కృషి చేయాలన్నారు.

భక్తి శ్రద్ధలతో బక్రీదు ప్రార్థనలు



నరసరావు పేట ఈద్గాలో జరిగిన ప్రార్థనలలో పాల్గొన్న ముస్లింలు

● చిలకలూరిపేట: పట్టణంలోని అడ్డరోడ్డు సెంటర్‌లో ఉన్న ఈద్గా మైదానంలో సోమవారం వేలాదిమంది ముస్లింలు సామూహిక నమాజ్ చేశారు. భక్తిశ్రద్ధలతో బక్రీదు పండుగను జరుపుకున్నారు. నమాజ్ సందర్భంగా ముఫ్తీ పఠాన్ అనస్ఖాన్ మాట్లాడుతూ త్యాగానికి ప్రతీక బక్రీదు పండుగ అని చెప్పారు. నమాజ్‌ను ఆయన నిర్వహింపచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లా ప్రసన్నం కోసం చేసిన అసమాన త్యాగాన్ని స్మరిస్తూ ప్రతి ఏటా బక్రీదు పర్వదినాన్ని నిర్వహిస్తారని తెలిపారు. స్వార్థం, అహం ఉన్న చోట మానవత్వం పరిమళించదన్నారు. ముందుగా ముఫ్తీ ఖలీలాఖాన్ బక్రీదు పండుగ విశేషాలను వివరించారు. ప్రార్థనల అనంతరం అందరూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రార్థనల ఏర్పాట్లను అంజుమన్-ఏ- ఇస్లామియా కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



బక్రీద్ పండుగ సందర్భంగా జరిగిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తదితరులు

నరసరావుపేట టౌన్, జూన్ 17: త్యాగనిరతికి నిలువెత్తు నిదర్శనం బక్రీద్ వేడుకలలో పాల్గొనడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. సోమవారం బక్రీద్ సందర్భంగా నరసరావుపేట పట్టణంలోని ఈద్గాలో నిర్వహించిన ప్రార్థనలలో పాల్గొన్నారు. ప్రార్థనలలో పాల్గొనేందుకు వచ్చిన ముస్లిం సోదరులను ఆప్యాయంగా పలకరించారు. త్యాగం, పేదల పట్ల కరుణకు చిహ్నంగా నిర్వహించేందుకు బక్రీద్ వేడుకలలో పాల్గొనటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రజల కోసం ఆలోచిస్తూ వారికి అండగా నిలవడానికి ప్రతిక్షణం చిత్తశుద్ధితో పని చేస్తానని అన్నారు. కార్యక్రమంలో బులియన్ మర్చంట్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మీరావలి, షేక్ మన్నాన్ షరీఫ్, బడే బాబు, మాబు తదితరులు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: మండలంలోని గ్రామాల్లో బక్రీదు పర్వదినాన్ని ముస్లింలు భక్తి శ్రద్ధలతో సోమవారం జరుపుకున్నారు. ఈద్గాల వద్ద జరిగిన ప్రార్థనల్లో అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఒకరికొకరు బక్రీదు పర్వదిన శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మసీదులకు, ఈద్గాలకు విద్యుత్ దీపాలంకరణ చేశారు. రొంపిచర్ల, గోగులపాడు, అలవాల, విప్పర్ల, కొత్తపల్లి, ఎడ్వర్డుపేట, మునమాక, అన్నవరం, సంతగుడిపాడు, కర్లకుంట గ్రామాల్లో ఈ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు.

● బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు, పేరూరుపాడు, కనమలచెరువు, రామాపురం, గుట్లాపల్లి, బొల్లాపల్లి, రేమిడిచర్ల, గుమ్మనంపాడు, మేళ్ళవాగు తదితర గ్రామాల్లో బక్రీదు పండుగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. పండుగ సందర్భంగా ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని బక్రీదు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ: ఎమ్మెల్యే జీవీ

వినుకొండ టౌన్, జూన్ 17: త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ పండుగను ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా స్థానిక తిమ్మాయిపాలెం రోడ్డులోని ఈద్గా వద్ద ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ముస్లింలతో కలిసి ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతి, సంతోషం, త్యాగానికి ప్రతీక బక్రీద్ పర్వదినం అంటూ ముస్లింలకు శుభాకాంక్షలు తెలియచేశారు. భగవంతుడిపై విశ్వాసం, నిస్వార్థ గుణానికి మారుపేరుగా బక్రీద్ నిలుస్తుందని అందరూ గుర్తుంచుకోవాల్సి అవసరం ఉందన్నారు. త్వరలో ఈద్గా వద్ద కాంపౌండ్ వాల్ నిర్మాణానికి, ఈద్గా అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ముస్లింలకు హామీఇచ్చారు.

● యడ్లపాడు: బక్రీద్ పర్వదిన వేడుకలను మండలంలోని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండల కేంద్రమైన యడ్లపాడు, బోయపాలెంలోని ఈద్గాలతోపాటు, వంకాయలపాడు, కారుచోల, లింగారావుపాలెం, కొండవీడు, కోట గ్రామాల్లోని మసీదుల వద్ద ముస్లిం పెద్దల ఆధ్వర్యంలో సామూహిక ప్రార్థనలు జరిగాయి. యడ్లపాడులోని ఈద్గావద్ద ముత్తవల్లీల ప్రార్థనల అనంతరం ధార్మికోపన్యాసం చేశారు. ప్రతి ఒక్కరూ దాన గుణం, సేవా గుణం అలవర్చుకోవాలని చెప్పారు. అనంతరం ముస్లింలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ బంధుమిత్రులతో సంతోషంగా గడిపారు. బక్రీద్ విశిష్టతలో భాగమైన ఖుర్బానీని పేదలకు దానంగా ఇచ్చారు.

● శావల్యాపురం: బక్రీద్ పర్వదిన వేడుకలను మండలంలోని కారుమంచి, మతుకుమల్లి, శానంపూడి, శావల్యాపురం, కొత్తలూరు, ఇర్లపాడు, పోట్లూరు, వేల్పూరు తదితర గ్రామాలలోని ముస్లింలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ముస్లింలు తెల్లవారుజామునే మసీదులకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు, నమాజ్ చేశారు. అనంతరం మసీదుల వద్ద కమిటీసభ్యులు ముస్లిం సోదరులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

● ఈపూరు: మండలంలో సోమవారం బక్రీద్‌ను ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముప్పాళ్ళ ఇనుమెళ్ళ, కొండ్రముట్లలోని ఈద్గాల వద్ద ప్రత్యేకప్రార్థనలు నిర్వహించారు.



చిలకలూరిపేటలో నమాజుకు హాజరైన ముస్లింలు



యడ్లపాడులోని ఈద్గావద్ద ...



కారుమంచి మసీదు వద్ద...



ఈపూరు ఈద్గా వద్ద ...

చంద్రబాబుతో నెరవేరనున్న ప్రజల ఆకాంక్షలు

● జగన్ ప్యాలెస్‌లో కోట్ల విలువ చేసే ఫర్నిచర్ సంగతేంటి ● ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, జూన్ 17: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో రాష్ట్ర ప్రజల ఆంకాంక్షలు నెరవేరబోతున్నాయని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ధీమా వ్యక్తం చేశారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం జనసేన, బీజేపీ, తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు మాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి, రైతులకు సాగునీరు, తాగు నీరు అందించడం టీడీపీ లక్ష్యం అన్నారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి అవినీతిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. జగన్ ఐదేళ్ల పాలనలో పేదలకు 30 లక్షలు ఇళ్లు ఇస్తామని, కనీసం 5శాతం కూడా పూర్తి చెయ్యలేదని విమర్శించారు. జగన్‌కు బెంగళూరు, హైదరాబాద్‌లో ఉన్న ప్యాలెస్‌లు చాలక, రుషికొండపై రూ.500 కోట్లతో అక్రమ నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. రాష్ట్రంలో పేదలకు మాత్రం సెంటు భూమిలో ఇళ్లు ఎలా నిర్మించుకుంటారన్నారు. రిషికొండలో రెండున్నర కోట్ల రూపాయలతో తన బాత్రూం రెండు సెంట్ల విస్తీర్ణంలో నిర్మించుకున్నారని విమర్శించారు. కానీ పేదోడికి ఇళ్ళు ఇవ్వలేని గజదొంగ జగన్ అని, కేంద్రం ఇస్తున్న ఇళ్లు కూడా ఇవ్వలేక, పోలవరం నిర్మించలేకపోయారని చెప్పారు. ప్రజలు ఇచ్చిన తీర్పును జగన్, బూతుల మంత్రులు మర్చిపోలేరన్నారు. జగన్ లక్షకోట్ల దోపిడీని ప్రజలు మర్చిపోలేరని, రూ.10లక్షల కోట్ల అప్పులు రాష్ట్రానికి మిగిల్చారని, అప్పులు తీర్చాలంటే సంవత్సరాలు పడుతుందన్నారు. అనుభవజ్ఞుడైన నారా చంద్రబాబు రావడంతో ప్రజలు ధైర్యంగా ఉండి జేజేలు పలుకుతున్నారన్నారు. ప్రజల ఆకాంక్షలను పోలవరాన్ని పరుగులు తీయిస్తారన్నారు. గతంలో స్పీకర్ కోడెల శివప్రసాద్‌రావు తన వద్ద ఉన్న ఫర్నిచర్ తీసుకుపోవాలని లెటర్ రాస్తే, ఆయన్ను వేధించి, ఆయన మరణానికి జగన్ కారణమయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నేడు జగన్ తన ప్యాలెస్‌లో కోట్ల రూపాయలతో ప్రభుత్వ సొమ్ముతో అక్రమ నిర్మాణాలు చేపట్టటం, కోట్ల రూపాయలు విలువ చేసే ఫర్నీచర్ నివాసంలో ఉంచుకోవటంపై ప్రశ్నించారు. ఇప్పటికైనా ఆయనపై చర్యలు తీసుకుని, కేసు నమోదు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు నాగ శ్రీను రాయల్, బీజేపీ నాయకులు రాఘవులు, టీడీపీ నాయకులు పీవీ సురేష్, గోవింద్ నాయక్, బీసీ నాయకులు గోవిందరాజులు, అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పాలనతో అందరికీ మంచి రోజులు

● అంగన్వాడీ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, అమూల్య

నరసరావుపేట రూరల్, జూన్ 17: రాష్ట్రంలో నియంత పాలన పోయి ప్రజాస్వామ్య పాలన వచ్చిందని, ప్రజలందరికీ, ప్రభుత్వ ఉద్యోగులందరికి మంచి రోజులు వచ్చాయని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. నరసరావుపేట పట్టణంలోని భువన చంద్ర టౌన్ హాల్లో అంగన్వాడీ కార్యకర్తలు నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, డాక్టర్ అమూల్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ అరవిందబాబు మాట్లాడుతూ కరోనా సమయంలో సమాజానికి అంగన్వాడీ కార్యకర్తలుచేసిన సేవ అనిర్వచనీయమన్నారు. గత ప్రభుత్వంలో వేతనాలు పెంచాలంటూ అంగన్వాడీ కార్యకర్తలు కోరితే కనీసం వారి వినతుల్ని పట్టించుకోకపోగా.. లాఠీలతో కుళ్లబొడిచిన ఘనత జగన్‌రెడ్డిదన్నారు. కనీసం పోరాటం చేయడానికి కూడా వీల్లేకుండా అణచివేసేందుకు ప్రయత్నించారన్నారు. కానీ టీడీపీ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తామన్నారు. వేతనాల పెంపు సహా అన్ని డిమాండ్లను పరిష్కరించేలా ముఖ్యమంత్రి చంద్రబాబును ఒప్పిస్తామన్నారు. జగన్‌రెడ్డి ప్రభుత్వం పంచాయతీల నిధులు కూడా దారి మళ్లించి వ్యవస్థల్ని నిర్వీర్యం చేశారన్నారు. ప్రజల్ని అణచివేయడమే ధ్యేయంగా అడుగులు వేస్తూ వచ్చారన్నారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా చిన్నాభిన్నం చేశాడని మండిపడ్డారు. ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటికీ ఆర్థికంగా దుర్భరమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నామన్నారు. విద్య, వైద్య రంగాలను సమూలంగా ప్రక్షాళనచేసి పారదర్శకమైన పాలన అందించే బాధ్యత తీసుకుంటామన్నారు. ప్రజల కోసం నిత్యం పనిచేసే అంగన్వాడీలను ఆదుకునే బాధ్యత నేను తీసుకుంటానని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు హామీ ఇచ్చారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం: డాక్టర్ అమూల్య

రాష్ట్రంలో మహిళలు ఆర్థికంగా రాణించాలన్నదే లక్ష్యంగా మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయంగా పనిచేయడం జరుగుతుందని డాక్టర్ చదలవాడ అమూల్య తెలిపారు. రెండు దశాబ్దాల తర్వాత నరసరావుపేటలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరవేసేందుకు కృషిచేసిన ప్రతి కార్యకర్త, ఓట్లేసి దీవించిన ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారి రుణం తీర్చుకుంటామన్నారు. జీతాల కోసం అంగన్వాడీలు చేసిన పోరాటానికి త్వరలోనే న్యాయంచేసి తీరుతామన్నారు. అంగన్వాడీలు సహా ప్రతి చిరుద్యోగి సమస్యకు ముఖ్యమంత్రి చంద్రబాబు పరిష్కారం చూపిస్తారన్నారు. పేద, బడుగు, బలహీనవర్గాలకు ఎలాంటి సమస్య వచ్చినా, వచ్చి సమస్య చెప్పుకోవచ్చునన్నారు. జగన్ రెడ్డి అనే నియంత పాలనపోయింది. ప్రజాస్వామ్య పాలన వచ్చిందని, ఇక్కడ ప్రజల అభీష్టం మేరకే పాలకులు నడుచుకుంటారని డాక్టర్ అమూల్య హామీ ఇచ్చారు.



మాజీ మంత్రి ప్రత్తిపాటికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న పట్టణ డాక్టర్లు

ప్రజల ప్రేమాభిమానాలకు నిదర్శనం ఈ గెలుపు

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జూన్ 17: స్థానిక ప్రజలు తమ కుటుంబంపై పెంచుకున్న ప్రేమాభిమానాలకు నిదర్శనమే చిలకలూరిపేట నుంచి నాల్గోసారి తన గెలుపు అని మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. సోమవారం భారతీయ వైద్య సంఘం చిలకలూరిపేట ప్రతినిధులు ప్రత్తిపాటి పుల్లారావును తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలసి నాల్గోసారి గెలుపొందిన సందర్భాన్ని పురస్కరించుకొని ఆయనను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ కీలకమైన సమయంలో ఎన్నో ఆశలు, ఆకాంక్షలు ఎంతో నమ్మకంతో ప్రజలు అందించిన ఈ విజయం తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. ఈ అనుభవం అధికారంతో ప్రజలకు ఏం చేయగలమన్నదే ఇప్పుడు తన ముందు ఉన్న కర్తవ్యం అన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో ప్రైవేట్ వైద్యుల పాత్ర కూడా మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా వైద్య సేవలకు కూటమి ప్రభుత్వంలో పెద్దపీట వేస్తున్న తరుణంలో వచ్చే అవకాశాలను అంతా అంది పుచ్చుకోవాలని ప్రత్తిపాటి పిలుపునిచ్చారు. ఆరోగ్య సేవలకు సంబంధించి ఉన్న సమస్యలను అతి త్వరలో ప్రభుత్వం పూర్తిస్థాయిలో పరిష్కరిస్తుందన్నారు. ఆరోగ్యశ్రీ సేవలను మరింత సులభతరం చేయటం, బిల్లులు వేగంగా మంజూరు చేయటం విషయంలో ఆస్పత్రులు, వైద్యుల సూచనలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని వారికి హామీ ఇచ్చారు.



కనపర్రులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చేసిన తప్పులను జగన్ నోరు విప్పి చెప్పాలి

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

నాదెండ్ల, జూన్ 17: గడిచిన ఐదు సంవత్సరాల్లో ముఖ్యమంత్రిగా జగన్ చేసిన తప్పులను తన నోటితోనే చెప్పక తప్పదని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మండలంలోని కనపర్రు గ్రామంలో కూటమి ఆధ్వర్యంలో సోమవారం జరిగిన విజయోత్సవ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతకాలం దాచిపెట్టిన రుషికొండ రాజకోట రహస్యాలపై జగన్ ఇప్పుడు ఏ సమాధానం చెపుతారని ప్రశ్నించారు. జగన్‌రెడ్డి గడిచిన ఐదు సంవత్సరాల్లో జనం సొమ్ముతో ఏ స్థాయిలో జల్సా చేశారో వందల కోట్ల విలాసాలకు ఎలా తగలేశారో రుషికొండ కట్టడాలే చెపుతున్నాయన్నారు. వైసీపీ ప్రభుత్వంలో దాచుకోవటం, దోచుకోవటం, నచ్చిన వాళ్ళకు కాంట్రాక్ట్ రూపంలో వందలు, వేల కోట్లు సంతర్పణ చేశారని ఆరోపించారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి బాటలో నడుస్తుందని, అమరావతి విశ్వనగరంగా రూపుదిద్దుకుంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.

నేడు కొమరవల్లిపాడులో అన్న ప్రసాద వితరణ

చిలకలూరిపేట, జూన్ 17: స్థానిక కొమరవల్లిపాడులో ఉన్న శ్రీలక్ష్మీ నృసింహ స్వామి వారి దేవస్థానంలో మంగళవారం ద్వాదశి తిథి, నృసింహస్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని భారీఎత్తున అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈవో, వంశపారంపర్య ధర్మకర్త సోమవారం తెలిపారు.



అగ్ని ప్రమాద బాధితులకు వంట సామాగ్రి, దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, పార్టీ నాయకులు

అగ్ని బాధిత కుటుంబాలకు జీవీ ఆర్థికసాయం

వినుకొండ, జూన్ 17: బొల్లాపల్లి మండలం రావులాపురంలో ఇటీవల విద్యుత్ షాట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు చేతుల మీదుగా సోమవారం నిత్యావసర వస్తువులు, దుస్తులు, వంట సామగ్రి పంపిణీ చేశారు. ఈసందర్భంగా అగ్ని ప్రమాదంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులు మేకల రాజు, మేకల దుర్గాప్రసాద్‌లకు ఆంజనేయులు ఆర్థికసాయం అందచేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గోవింద్ నాయక్, పెమ్మసాని నాగేశ్వరరావు, మన్నయ్య, వెంకటకోటయ్య, ఎలిశెట్టి రంగయ్య తదితరులు పాల్గొన్నారు.



శావల్యాపురంలో పాదయాత్రకు సంఘీభావం తెలుపుతున్న టీడీపీ నాయకులు

తెలుగు మహిళల పాదయాత్రకు సంఘీభావం

శావల్యాపురం, జూన్ 17: సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి ఘన విజయం సాధించడంతో సత్తెనపల్లి నియోజకవర్గం రాజుపాలెం మండలం ఇనిమెట్ల గ్రామానికి చెందిన తెలుగు మహిళలు మల్లికార్జున స్వామికి మొక్కుబడులు తీర్చుకొనేందుకు పాదయాత్రగా శ్రీశైలానికి బయలుదేరారు. పాదయాత్రలో భాగంగా సోమవారం శావల్యాపురం చేరుకొన్న మహిళలను గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు శావల్యాపురం సెంటర్లో కలసి సంఘీభావాన్ని ప్రకటించారు. తెలుగు మహిళలు మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయడంతో పాటు సత్తెనపల్లి ఎమ్మెల్యేగా కన్నా లక్ష్మీనారాయణ మంచి మెజారిటీతో గెలుపొందడంపై ఆనందాన్ని వ్యక్తం చేశారు. తమ కోరిక నెరవేరడంతో కాలినడకన శ్రీశైలానికి వెళ్ళి మల్లికార్జునుడికి మొక్కుబడులు తీర్చుకోవడానికి వెళుతుండటం సంతోషకరంగా ఉందన్నారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రం అభివృద్ధిపథంలోకి దూసుకుపోవడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు.

మద్దిరాల పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడిగా కిలారి

చిలకలూరిపేట, జూన్ 17: చిలకలూరిపేట మండలం మద్దిరాలలో పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులను సోమవారం పాలకేంద్రం సభ్యులు ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా కిలారి హనుమంతరావు, ఉపాధ్యక్షుడిగా చంద్ర రాంబాబు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గాన్ని పలువురు పాల కేంద్రం సభ్యులు అభినందించారు.